**విలేకరులు కావలెను**

మనవార్త దినపత్రిక లో పనిచేయుటకు విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్స్, మరియు నియోజక వర్గాల వారిగా మండల స్థాయి రిపోర్టర్లు కావలెను

Cell: 9247819181
8309605189

# మన వార్త
ప్రజాగళానికి అక్షర రూపం
MANA VAARTHA

EPAPER.MANAVAARTHA.NET
MANA VAARTHA

Telangana | సంపుటి: 1, సంచిక: 183 | volume: 1, Issue: 183 | శనివారం 31 జనవరి 2026 పేజీలు : 8 వెల : 3.00

## భక్త సంద్రంగా మారిన మేడారం
## శ్రీ సమ్మక్క-సారలమ్మ మహా జాతర

- అన్ని దారులు మేడారం వైపే...
- నిలువెత్తు బంగారం సమర్పించుకున్న భక్తులు...
- భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు...

**మేడారం, జనవరి 30(మనవార్త)** వెదురు కర్రలే దైవాలుగా, గద్దెలే గర్భగుడులుగా, పసుపు-





కుంకుమలే వస్త్రాభరణాలుగా, బెల్లమే నిలువెత్తు బంగారంగా, ఒడిబియ్యమే పరమాన్నంగా, చీర ముక్క-రైక బట్టలే సారెలుగా మారి తల్లులకు సమర్పించే అపూర్వ ఆధ్యాత్మిక మహోత్సవం - మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర భక్తి పారవశ్యంతో అట్టహాసంగా కొనసాగుతోంది.వన దేవతడ మన దేవతడ జన దేవత అంటూ అపార విశ్వాసంతో కోట్లాది భక్తుల హృదయాలను ఏకం చేసే ఈ ప్రపంచ ప్రసిద్ధి గాంచిన జాతరకు దేశం నలుమూలలతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాది భక్తజనం మేడారానికి తరలివస్తున్నారు. భక్తులతో కిక్కిరిసిన జాతర ప్రాంగణం...జాతర ప్రాంగణం మొత్తం భక్తులతో కిటకిటలాడుతోంది. ఎటు చూసినా భక్తులే దర్శనమిస్తున్నారు. క్రమబద్ధంగా ఏర్పాటు చేసిన క్యూ లైన్లలో భక్తుల బారులు దర్శనానికి ఎదురుచూస్తుండగా, ప్రశాంత వాతావరణంలో తల్లుల దర్శనాలు సజావుగా కొనసాగుతున్నాయి. భక్తుల రద్దీని సమర్థంగా నియంత్రిస్తున్న అధికార యంత్రాంగం...భారీ రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాయి. ట్రాఫిక్ నియంత్రణ, క్యూ లైన్ నిర్వహణ, భక్తుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించారు.జంపన్న వాగులో పుణ్యస్నానాలతో భక్తుల సందడి నెలకొనగా, గద్దెల వద్ద భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. వైద్య బృందాలు, వాలంటీర్లు అప్రమత్తం...జాతర ప్రాంగణం అంతటా వైద్య బృందాలు అప్రమత్తంగా సేవలందిస్తుండగా, క్యూ లైన్ల వద్ద వాలంటీర్లు నిరంతరం భక్తులకు సహకారం అందిస్తున్నారు. భక్తుల రద్దీని తట్టుకునేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు సమర్థంగా కొనసాగుతున్నాయి.వన దేవతల సేవలో ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు...మేడారం మహా జాతరకు వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి సుమారు 500 మంది ఎన్.ఎన్.ఎన్. వాలంటీర్లు



సేవలందిస్తున్నారు.సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద, క్యూ లైన్లలో భక్తులకు సహాయం చేయడం, జంపన్న వాగు వద్ద సూచనలు ఇవ్వడం, తప్పిపోయిన భక్తులను శిబిరాలకు చేర్చడం వంటి సేవలతో వాలంటీర్లు జాతరలో కీలక పాత్ర పోషిస్తున్నారు.ప్రముఖుల దర్శనాలుడఈ సందర్భంగా



పలువురు ప్రముఖులు శ్రీ సమ్మక్క-సారలమ్మ తల్లులను దర్శించుకుని మొక్కులు సమర్పించారు.తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ - నిలువెత్తు బంగారం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి - తల్లులను దర్శించుకున్నారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ- అమ్మవార్లను దర్శించుకున్నారు. మంత్రి శ్రీమతి సీతక్క, రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ, మహబూబాబాద్ ఎంపి పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, పాయం వెంకటేశ్వర్లు, గండ్ర సత్యనారాయణ- అమ్మవార్లను దర్శించి మొక్కులు తీర్చుకున్నారు.బ్రిటిష్ డిప్యూటీ హై కమిషన్ గ్యారత్ వెన్ ఓవెన్ సమ్మక్క-సారలమ్మలకు తులాభారం సమర్పించి తల్లులను దర్శించుకున్నారు.భక్తుల ప్రశంసల జల్లు...ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత జాతరలతో పోలిస్తే ఈసారి దర్శనాలు మరింత సులభంగా, వేగంగా జరుగుతున్నాయని, భద్రత, పారిశుద్ధ్యం, వైద్య సేవలు మెరుగ్గా ఉన్నాయని భక్తులు ప్రశంసిస్తున్నారు.

## రాజ్‌ఘాట్‌లో మహాత్మాగాంధీకి ప్రధాని నివాళులు



**న్యూఢిల్లీ:**దేశ పితామహుడు మహాత్మా గాంధీ కి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజ్‌ఘాట్‌లో ఘన నివాళులు అర్పించారు. గాంధీ స్మారక స్థలంలో పుష్పాలు సమర్పించి ఆయనకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా గాంధీ జీవితం, ఆయన త్యాగాలు దేశానికి శాశ్వత ప్రేరణగా నిలుస్తాయని ప్రధాని పేర్కొన్నారు. మహాత్మాగాంధీ ప్రతిపాదించిన అహింస, సత్యం, న్యాయం వంటి శాశ్వత సిద్ధాంతాలు నేటికీ భారతదేశ ప్రయాణానికి మార్గదర్శకాలుగా కొనసాగుతున్నాయని ప్రధాని తెలిపారు. దేశం ఎదుర్కొంటున్న సవాళ్ల మధ్య గాంధీ ఆలోచనలు మరింత ప్రాసంగికంగా మారాయని ఆయన అభిప్రాయపడ్డారు. న్యాయం, సమరసత, మానవసేవ పునాదులపై నిలిచిన భారతదేశాన్ని నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రధాని స్పష్టం చేశారు. ప్రతి పౌరుడి జీవితంలో గాంధీ సూత్రాలు ఆచరణలోకి రావాలని, అప్పుడే సమాజం నిజమైన పురోగతిని సాధిస్తుందని పేర్కొన్నారు. గాంధీ సిద్ధాంతాల పట్ల దేశం తన నిబద్ధతను మరోసారి పునరుద్ఘాటించిందని ప్రధాని తెలిపారు. గాంధీ చూపిన మార్గంలో నడుస్తూ దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రాజ్‌ఘాట్ వద్ద ఏర్పడిన వాతావరణం గాంధీ స్మృతులతో గంభీరంగా మారింది.

## ఫ్రాన్స్ రవాణా మంత్రితో కేంద్ర మంత్రి రామ్‌మోహన్ నాయుడు భేటీ

**న్యూఢిల్లీ:**కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్ మోహన్ నాయుడు కింజరపు ఫ్రాన్స్ అధ్యక్షుడి రాష్ట్ర పర్యటనకు ముందు ఫ్రాన్స్ రవాణా మంత్రి ఫిలిప్ టాబరోట్ నేతృత్వంలోని ఫ్రెంచ్ ప్రతినిధి బృందాన్ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో భారత్-ఫ్రాన్స్ మధ్య దీర్ఘకాలిక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే అంశాలపై చర్చ జరిగింది.ప్రధానంగా రెండు దేశాల మధ్య విమాన అనుసంధానాన్ని విస్తరించాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి ప్రస్తావించారు. పెరుగుతున్న నగరీకరణ, ప్రయాణ అవసరాలకు అనుగుణంగా భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని అడ్వాన్స్‌డ్ ఎయిర్ మొబిలిటీ, సస్టైనబుల్ ఏవియేషన్ ఫ్యూయల్స్ (ఎస్ఏఎఫ్) వంటి సాంకేతికతలపై ద్వైపాక్షిక సహకారం కీలకమని ఆయన పేర్కొన్నారు. భారత్‌ను ప్రపంచ స్థాయి విమానయాన శక్తిగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి తెలిపారు. గౌరవ ప్రధాని నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో భారత విమానయాన రంగం వేగంగా ముందుకు సాగుతోందని అన్నారు. ఈ క్రమంలో ఫ్రాన్స్‌తో భాగస్వామ్యానికి కీలక స్థంభంగా విమానయాన శిక్షణ, స్కిల్లింగ్ వ్యవస్థ అభివృద్ధి నిలవనుందని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇరు దేశాల మధ్య సాంకేతిక పరిజ్ఞానం, మానవ వనరుల అభివృద్ధి రంగాల్లో మరింత సన్నిహిత సహకారం కొనసాగుతుందని కేంద్ర మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్-ఫ్రాన్స్ వ్యూహాత్మక సంబంధాలకు ఇది మరో బలమైన అడుగుగా నిలుస్తుందని తెలిపారు.

## పిల్లల సోషల్ మీడియా వినియోగంపై కర్ణాటకలో తీవ్ర చర్చ



**బెంగళూరు:**పిల్లలకు సామాజిక మాధ్యమాల వినియోగాన్ని నియంత్రించే అంశంపై కర్ణాటక ప్రభుత్వం తీవ్రంగా చర్చిస్తున్నట్లు రాష్ట్ర ఐటీ, బీటీ శాఖ మంత్రి ప్రియాంక్ ఖర్గే తెలిపారు. ఈ విషయంలో ఎదురయ్యే ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని అన్ని కోణాల్లో అధ్యయనం చేస్తున్నామని శుక్రవారం శాసనసభలో ఆయన వెల్లడించారు. బీజేపీ సీనియర్ ఎమ్మెల్యే ఎస్. సురేశ్ కుమార్ లేవనెత్తిన ఆందోళనలకు స్పందిస్తూ మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ అంశం అత్యంత తీవ్రమైనదని పేర్కొన్న ప్రియాంక్ ఖర్గే, ఇప్పటికే ఫిన్‌లాండ్, యునైటెడ్ కింగ్‌డమ్, ఆస్ట్రేలియా వంటి దేశాలు పిల్లల సామాజిక మాధ్యమాల వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటున్నాయని గుర్తుచేశారు. కృత్రిమ మేధస్సు, సామాజిక మాధ్యమాలను బాధ్యతాయుతంగా ఎలా ఉపయోగించాలనే దానిపై ప్రభుత్వం విస్తృతంగా చర్చిస్తోందని, ఈ విషయం ప్రస్తుతం పరిశీలన దశలో ఉందని స్పష్టం చేశారు. ఇది భవిష్యత్తుకు తీవ్రమైన ముప్పని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే చర్యలు తీసుకోకపోతే పాఠశాలలు, కుటుంబ వ్యవస్థలు దెబ్బతింటాయని హెచ్చరిస్తూ, ఇలాంటి కీలక అంశాలపై రాజకీయాలకు అతీతంగా నిర్ణయాలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

## కిర్గిజిస్తాన్ సైన్యానికి హై ఆల్టిట్యూడ్ యుద్ధ శిక్షణ పూర్తి



**లేహ్:**భారత సైన్యానికి చెందిన హై ఆల్టిట్యూడ్ వార్‌ఫేర్ స్కూల్ కిర్గిజిస్తాన్ సాయుధ దళాల సభ్యుల కోసం నిర్వహించిన రెండు వారాల ప్రత్యేక టైలర్ మేడ్ శిక్షణ కోర్సును విజయవంతంగా పూర్తి చేసింది. అత్యంత ఎత్తైన పర్వత ప్రాంతాలు, కఠిన వాతావరణ పరిస్థితుల మధ్య ఈ శిక్షణ కార్యక్రమం కొనసాగింది.ఈ శిక్షణలో సైనిక స్కీయింగ్, గాయపడిన సిబ్బంది తరలింపు (క్యాజువాల్టీ ఎవాక్యుయేషన్), అవలాంచ్ రిస్క్యూ అండ్ రికవరీ డ్రిల్లులు, హై ఆల్టిట్యూడ్ సిక్నెస్ నిర్వహణ వంటి కీలక అంశాలపై ప్రత్యేకంగా శిక్షణ అందించారు. వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించేలా నిర్వహించిన డ్రిల్లులు శిక్షణార్థులకు ఉపయోగకరంగా నిలిచాయి.ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా భారత్కిర్గిజిస్తాన్ మధ్య సైనిక సహకారం బలోపేతం కాగా, “ఫ్రెండ్స్ ఫర్ లైఫ్” అనే స్నేహ భావన మరింత పటిష్టమైందని భారత సైన్యం పేర్కొంది. భవిష్యత్తులో కూడా ఇలాంటి సంయుక్త శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతాయని వెల్లడించింది.

## వివాదాస్పద వ్యాఖ్యలపై ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వివరణ



**హైదరాబాద్:**తన వ్యాఖ్యలు ఉద్దేశ్యపూర్వకంగా చేసినవి కావని, ఎవరి మనోభావాలైనా దెబ్బతిన్నట్లయితే హృదయపూర్వకంగా క్షమాపణలు కోరుతున్నట్లు బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తనపై, తన కుటుంబంపై రాజకీయ కక్షతో దాడులు జరుగుతున్నాయని, ఇందుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రోత్సాహమే కారణమని ఆరోపించారు. పోలీసులు, అధికారులు అంటే తనకు ఎంతో గౌరవమని పేర్కొంటూ, అయితే సమ్మక్క జాతరకు వెళ్తున్న సమయంలో కొందరు అధికారులు అడ్డుకొని తీవ్ర ఒత్తిడికి గురి చేశారని తెలిపారు. ఆ సమయంలో ఏర్పడిన ఫ్రస్టేషన్, మానసిక ఒత్తిడిలో తన నోరు జారిందని, అంతే తప్ప ఎవరి పట్లనూ కావాలనే దూషణలు చేయలేదని కౌశిక్ రెడ్డి వివరణ ఇచ్చారు. తన మాటలను తప్పుగా అర్థం చేసుకుని కొందరు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై మరింత వివాదాలు అవసరం లేదని, దీనిని ఇంతటితో ముగించాలని అందరినీ వేడుకుంటున్నట్లు పాడి కౌశిక్ రెడ్డి కోరారు. ప్రజల మనోభావాలకు గౌరవం ఇస్తానని, తన వ్యాఖ్యల వల్ల ఎవరైనా బాధపడ్డట్లయితే మరోసారి క్షమాపణలు తెలుపుతున్నానని ఆయన స్పష్టం చేశారు.

## మేడారం జాతరలో సమ్మక్క సారలమ్మలకు మొక్కులు చెల్లించిన కవిత



**మేడారం:**ఆదివాసీల సంస్కృతీ సంప్రదాయాలకు, సామూహిక భక్తి చైతన్యానికి, సమష్టి ఆధ్యాత్మిక ప్రాభవానికి ప్రతీకగా నిలిచిన మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పాల్గొన్నారు. జాతర సందర్భంగా అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.సమ్మక్క-సారలమ్మ జాతరలో ఎత్తు బంగారం మొక్కు చెల్లించుకొని అమ్మవార్లకు నివాళులు అర్పించారు. శతాబ్దాలుగా కొనసాగుతున్న ఆదివాసీ సంప్రదాయాలను గౌరవిస్తూ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతర ఆధ్యాత్మిక వాతావరణాన్ని కవిత ప్రశంసించారు.కోరిన కోరికలు తీర్చే వనదేవతలుగా సమ్మక్క-సారలమ్మలను భక్తులు విశ్వసిస్తారని, ఈ జాతరలో పాల్గొనడం ఆత్మీయ అనుభూతిని కలిగించిందని ఆమె పేర్కొన్నారు. సామూహిక భక్తి, సమష్టి విశ్వాసం మేళవించిన ఈ మహాజాతర గిరిజనుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు.సమ్మక్క-సారలమ్మల దీవెనలతో ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆమె ప్రార్థించారు. రాష్ట్ర ప్రజల జీవితాల్లో శాంతి, శ్రేయస్సు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

## 6 వ వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన కేతోజి కరుణ

**-ప్రజాసేవే లక్ష్యంగా పనిచేస్తానని హామీ కేతోజి వినోద్ కుమార్....**



**గజ్వేల్ జనవరి 30 మన వార్త ప్రతినిధి** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో 6 వ వార్డు స్వాతంత్ర అభ్యర్థి కేతోజి కరుణ శు క్రవారం గజ్వేల్ ఐ ఓ సి కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు ఈ సందర్భంగా వారు కేతోజి వినోద్ కుమార్ మాట్లాడుతూ కౌన్సిలర్ అభ్యర్థి గా మ అమ్మ కేతోజి కరుణ మీ ముందుకు వస్తున్నారని వార్డ్ అభివృద్ధి ధ్యేయంగా ప్రజా సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తానని చెప్పారు అలాగే శివాలయం వీధిలో రోడ్డు సరిగ్గా లేకపోవడం గత 10 సంవత్సరాల నుండి ఎ ప్రభుత్వం పట్టించుకునే నాథుడే లేడు కాబట్టి నేను ఇవి చేయడానికి ముందుకు వస్తున్ననీ మీరు ఆదరించి నన్ను 6,వ వార్డు ప్రజలు ఆశీర్వదించాలని కోరారు, ఈ కార్యక్రమంలో హనుమంతు, వెంకటేషం, నరేష్, ప్రభుదాస్, సంతోష్, వనపతి, భాస్కర్, విష్ణు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనాన్ని నడిపిన 4 నలుగురికి 41,000/- జరిమానా




**-డ్రైవింగ్ లైసెన్స్ లేని 06 మంది వ్యక్తులకు ఒక్కొక్కరికి 5,000/- చొప్పున 30,000/- జరిమాన...**

**-మద్యం సేవించి వాహనాలు నడపవద్దు...**

**-డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపవద్దు...**

**సిద్దిపేట జిల్లా, జనవరి 30, మన వార్త ప్రతినిధి** సిద్ధిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్, సిబ్బందితో గత కొన్ని రోజుల క్రితం పట్టణంలో పరిసర ప్రాంతాలలో వాహనాలు తనిఖీ చేయగా నలుగురు మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా పట్టుకొని బ్రీత్ ఎనలైజర్ తో తనిఖీ చేయగా మద్యం సేవించి ఉన్నారని రిపోర్టు రాగా శుక్రవారం సిద్ధిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కాంతారావు, న్యాయమూర్తి ముందు హాజరుపరచగా విచారణ చేసి 04 నలుగురికి 41,000/- జరిమానావిధించారు.డ్రైవింగ్ లైసెన్స్ లేని 06 ఆరుగురు వ్యక్తులకు ఒక్కొక్కరికి 5,000/- చొప్పున 30,000/- జరిమాన.ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ ప్రవీణ్,మాట్లాడుతూ.రోడ్డు ప్రమాదాల నివారణ గురించి మద్యం సేవించి వాహనాలు నడిపే వాళ్ళ ని కట్టడి చేయడానికి, ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించడంజరుగుతుందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదం రోడ్డుపై వెళ్లే ఇతర వాహనదారులకు కూడా ప్రమాదమని ప్రమాదాల నివారణ గురించి మాత్రమే డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించడంజరుగుతుందన్నారు, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టో పట్టుబడిన వాళ్ళ ని కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ విచారణ జరిపి 10 వేల రూపాయల జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు. పదివేల రూపాయలు కట్టడం వల్ల మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, ప్రజల్లో వాహనదారుల్లో అవగాహన రావడం జరుగుతుందన్నారు.డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపవద్దని సూచించారు నడిపినచో ఒక్కొక్కరికి 5000/- రూపాయల జరిమానా విధించడంజరుగుతుందన్నారు.రోడ్డు ప్రమాదాల నివారణ గురించి మాత్రమే ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించడంజరుగుతుందన్నారు.

## సమ్మక్క జాతరకు వచ్చిన వ్యక్తికి అస్వస్థత



**- 108 వాహనంలో ఆస్పత్రికి తరలింపు...**

**శంకరపట్నం:జనవరి30(మనవార్త ప్రతినిధి)** సమ్మక్క-సారలమ్మ జాతరకు వచ్చిన వ్యక్తి అస్వస్థకు గురయ్యాడు.వివరాల్లోకి వెళ్తే శంకరపట్నం మండలం కేశవపట్నం సమ్మక్క-సారలమ్మ జాతరకు మానకొండూర్ గ్రామం నుండి సిరిగిరి రమేష్ (30) మరియు అతని భార్య సుజాతతో కలిసి గురువారం సాయంత్రం కేశవపట్నం సమ్మక్క-సారలమ్మ జాతరకు వచ్చాడు.శుక్రవారం ఉదయం సిరిగిరి రమేష్ కు అకస్మాత్తుగా కడుపునొప్పి రావడంతో అక్కడ ఉన్న స్థానికులు 108కి ఫోన్ చేయడంతో 108 సిబ్బంది ఈఎంటి గూడూరి సతీష్ రెడ్డి,మరియు పైలట్ ఎం.గోపికృష్ణ సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రున్ని అంబులెన్స్ లోనికి తీసుకొని ప్రథమ చికిత్స అందిస్తూ కరీంనగర్ ప్రభుత్వ హాస్పిటల్ కు తరలించారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



**సిద్దిపేటజిల్లా,జనవరి30,మన వార్త ప్రతినిధి** సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం పాములపర్తి గ్రామనికి చెందిన కోట ఐలయ్య అనారోగ్యంతో మరణించడంజరిగింది.విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ పాండు గౌడ్,సర్పంచ్ దుబ్బాసి భవాని బాలకిషన్,మండల బీసీ సెల్ అధ్యక్షుడు మ్యాకల కనకయ్య ముదిరాజ్,ఉప సర్పంచ్ జట్టు సుధాకర్ శుక్రవారం రోజు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి,ప్రగాఢ సానుభూతి తెలిపి ఆర్థిక సహాయంఅందజేశారు.సీనియర్ నాయకులు బేతి నరేందర్ రెడ్డి,శ్రీనివాస్ గౌడ్, ఎడెల్లి మల్లేష్,మేకచెవుల కర్ణాకర్,వార్డు సభ్యులు చిన్నబోయిన మల్లేష్,నీరుడి రాజు,తాడూరిలక్ష్మణ్,శ్రీనివాస్,కొండనోళ్ళ కర్ణాకర్ గ్రామస్తులు వున్నారు.

## ప్రవీణ మదర్ అండ్ చైల్డ్ ఆస్పత్రిని ప్రారంభించిన మైనంపల్లి...




**రామయంపేట జనవరి 30 ( మన వార్త ప్రతినిధి)** రామాయంపేట మున్సిపల్ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రవీణ మదర్ అండ్ చైల్డ్ హాస్పిటల్ ను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ప్రారంభించారు, ప్రారంభోత్సవానికి హాజరైన మైనశీపల్లి హనుమంతరావుకు ఆసుపత్రి సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు, అనంతరం ఆయనను షాలువాతో ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా మైనంపల్లి హనుమంతరావు మాట్లాడుతూ రామాయంపేట పరిసర గ్రామాలన్నీ కూడా రైతు కుటుంబాలు ఎక్కువగా ఉంటాయని చాలా కుటుంబాలు పేద కుటుంబాలు ఉంటాయని కాబట్టి ఆసుపత్రి సిబ్బంది తక్కువ ఖర్చుతో ఎక్కువ వైద్యం అందించే విధంగా కృషి చేయాలని ఆయన తెలిపారు, ఎవరైనా పేదవారు ఆసుపత్రికి వస్తే ఆర్థికంగా వారిని ఆదుకునేందుకు ఆసుపత్రి బిల్లులో సగం బిల్లును మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ భరిస్తుందని ఆయన తెలిపారు, రామాయంపేటలో ఏర్పాటుచేసిన ఆసుపత్రి పేదలకు తక్కువ ఖర్చుతో మంచి వైద్యాన్ని అందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మైనంపల్లి హనుమంతరావు, తోపాటు మాజీ జెడ్పిటిసి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సరాఫ్ యాదగిరి, గజవాడ నాగరాజు, దేమే యాదగిరి, రమేష్ రెడ్డి, రాజు రెడ్డి, మనోహరాబాద్ మైపాల్ రెడ్డి, స్వామి, డాకి స్వామి, ఆస్పత్రి వైద్య సిబ్బంది డాక్టర్ ప్రవీణ, డాక్టర్ రవీంద్రబాబు, తిరుపతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు,

## సమ్మక్క- సారలమ్మ జాతర బోనాల ఊరేగింపులో గ్రామస్తులతో చిందులు వేసిన గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు చిదుగు గోవర్ధన్ గౌడ్



**రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట్ మండల్ మన వార్త ప్రతినిధి జనవరి 30:** ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామంలో నేడు సమ్మక్క- సారలమ్మ జాతరలో భాగంగా బోనాల ఊరేగింపులో గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు చిదుగు గోవర్ధన్ గౌడ్ గ్రామస్తులతో కలిసి చిందులు వేసి చూపరులను ఆకట్టుకున్నారు,గోవర్ధన్ గౌడ్, ఇట్టి మహోత్సవానికి హాజరు కావడంతో గ్రామస్తులలో మరింత ఉత్సాహాన్ని నింపాయని గ్రామస్తులు తెలిపారు, అనంతరం గోవర్ధన్ గౌడ్, మాట్లాడుతూ... సమ్మక్క-సారలమ్మను నమ్ముకున్న భక్తులు మరియు గ్రామస్తుల కష్టాల చీకట్లను తరిమికొట్టి, పాడి పంటలు రక్షించాలని దేవతలను వేడుకొని దర్శించుకున్నారు,గ్రామ సర్పంచ్ ఇల్లెందుల గీతాంజలి-శ్రీనివాస్ రెడ్డి, మరియు కొండాపురం వెంకటరెడ్డి,లతో సంభాషించి సర్పంచ్ గా ఎన్నుకున్న ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పాలకులతో కలిసి మంచి పరిపాలన కొనసాగించాలని, జిల్లాలోనే అభివృద్ధిలో మొదటి స్థానంలో రాచర్ల బొప్పాపూర్ గ్రామాన్ని ముందు ఉంచాలని ఇట్టి విషయంలో గోవర్ధన్ గౌడ్, కూడా సహాయ సహకారం అందిస్తారని తెలిపి గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు,ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొండాపురం వెంకట్ రెడ్డి, పాలకవర్గం మరియు అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జాతిపిత 78 వ వర్ధంతి..



**-అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా మౌనం పాటించిన నాయకులు...**

**మన వార్త ప్రతినిధి ఎల్లారెడ్డి పేట జనవరి 30 :** జాతిపిత మహాత్మా గాంధీ 78,వ వర్ధంతి సందర్భంగా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షులు బొమ్మకంటి రవి గుప్తా ఆధ్వర్యంలో శుక్రవారం గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.. అనంతరం అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా పాల్గొన్న అందరూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు, ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బందారపు బాల్ రెడ్డి, ఈవో ప్రవీణ్ కుమార్, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు బొమ్మ కంటి రాజయ్య గుప్తా, బుస గంగాధర్ గుప్తా, చకినం మధు గుప్తా, గంప నాగేంద్రం గుప్తా,గంప అంజయ్య గుప్తా, బొమ్మ కంటి భాస్కర్ గుప్తా, రాజు గుప్తా బొమ్మకంటి అశోక్ గుప్తా, సీనియర్ జర్నలిస్టు బండారి బాల్ రెడ్డి,బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు ఎడ్ల సందీప్,ప్రముఖ ఫోటోగ్రాఫర్ ముత్యాల ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాలరాజు యాదవ్, మెగి నర్సయ్య, గుర్రపు రాములు, నవాబు, వార్డు సభ్యులు శ్యామ మంజుల, అంతేర్పుల గోపాల్, చెన్నయ్య, దోనుకుల రామచంద్రం, మల్లారం మానస రాజేందర్ రెడ్డి, గరిపెల్లి అశోక్ గుప్తా తదితరులు పాల్గొని పూలమాలలు వేసి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. గ్రామపంచాయతీలో ఎల్లారెడ్డిపేట గ్రామపంచాయతీ ఆవరణలోని మహాత్మా గాంధీ విగ్రహానికి పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఉప సర్పంచ్ బందారపు బాల్ రెడ్డి వార్డు సభ్యులు గ్రామ ప్రముఖులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు

## మచ్చ బొల్లారంలో లేబర్, ఈ-శ్రమ్ కార్డుల ఉచిత దరఖాస్తులు



**-సురేష్ సేవా సమితి ఆధ్వర్యంలో కార్మికులకు సేవ...**

**మేడ్చల్ మల్కాజ్‌గిరి, జిల్లా జనవరి 30 మన వార్త:** మల్కాజ్‌గిరి నియోజకవర్గ పరిధిలోని అల్వాల్ జీహెచ్ఎంసి సర్కిల్□191 డివిజన్, మచ్చ బొల్లారంలో కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని లేబర్ కార్డు, ఈ-శ్రమ్ కార్డుల కోసం ఉచిత దరఖాస్తు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సురేష్ సేవా సమితి ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై లేబర్ కార్డు, ఈ-శ్రమ్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. కార్మికులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, లాభాలపై నిర్వాహకులు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఢిల్లీ పరమేష్, మధుసూదన్ రెడ్డి, వెంకటేష్, దప్పు రాజు, శంకర్ రెడ్డి, నర్సింగ్, వర్ష, ధనరాజ్, కృష్ణతో పాటు సురేష్ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు. కార్మికుల సంక్షేమానికి ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా చేపట్టాలని నాయకులు పేర్కొన్నారు.కార్మికుల జీవితాల్లో భద్రత, ఆర్థిక స్థిరత్వం కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని సురేష్ సేవా సమితి ప్రతినిధులు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని వారు వెల్లడించారు.

## బిఆర్ఎస్ లో చేరిన దుబాసి వెంకటస్వామి..



**హనుమకొండ జిల్లా (మన వార్త )ప్రతినిధి వరకాల టౌన్ జనవరి 30**కాంగ్రెస్ కు వరుస షాక్‌లు.. బిఆర్ఎస్ వైపు ప్రజా ప్రవాహం..పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు దుబాసి వెంకటస్వామి గారు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి, పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గారి సమక్షంలో భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) లో చేరడం జరిగింది.వారితో పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన బొచ్చు సతీష్, దంద్ర వెంకట్, ఒంటేరు బాబురావు, కోగిల సుధాకర్ తదితరులు కూడా బిఆర్ఎస్ లో చేరారు. చేరిన వారందరికీ మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గారు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి గారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి గడిచిన కాలంలో ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందని విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలతో కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి పెరిగిందని, అందుకే నాయకులు, కార్యకర్తలు బిఆర్ఎస్ వైపు ఆకర్షితులవుతున్నారని తెలిపారు. పరకాల నియోజకవర్గంలో బిఆర్ఎస్ మరింత బలపడుతుందని, రాబోయే ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు,యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆల్వాల్‌లో జ్యువెలరీ షాప్‌లో చోరీ

**-అపహరణ ఘటనా స్థలంలోనే కేసు నమోదు...**

**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా జనవరి 30 మన వార్త:** ఆల్వాల్ పరిధిలోని జ్యువెలరీ షాప్‌లో చోరీ జరిగిన ఘటన స్థానికంగా కలకలం




రేపింది. శుక్రవారం ఉదయం 6.00 గంటల సమయంలో డయల్ 100కు ఫిర్యాదు అందిందని ఆల్వాల్ పోలీసులు తెలిపారు.ఫిర్యాదు చేసిన వ్యక్తి వరగంటి సురేష్ కుమార్ (47), వృత్తి స్వర్ణకారుడు శ్రీకృష్ణ రెసిడెన్సీ, టెంపుల్ ఆల్వాల్. ఆయన తెలిపిన వివరాల మేరకు, జీఎన్ఆర్ హాస్పిటల్ సమీపంలో ఉన్న మమత సాయి జ్యువెలరీ షాప్‌లో చోరీ జరిగినట్లు సమాచారం అందింది.సమాచారం అందిన వెంటనే ఆల్వాల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. షాప్ షట్టర్ పగలగొట్టి భాగంగా తెరిచి ఉండటం, అలాగే గ్లాస్ డోర్ ప్యానెల్స్ పూర్తిగా విరిగిపోయి ఉండటం గమనించారు. షాప్‌లోకి వెళ్లి పరిశీలించగా, వెండి ఆభరణాల పెట్టెలు చెల్లాచెదురుగా పడివున్నట్లు గుర్తించారు.తదుపరి విచారణలో, 43 వెండి లెగ్‌చైన్‌ల పెట్టెలు, సుమారు 1.4 కిలోల బరువుతో, గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్లు నిర్ధారణ అయింది.పోలీస్ శాఖ ఇటీవల జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం, ఘటనా స్థలంలోనే కేసు నమోదు చేసే విధానాన్ని అమలు చేస్తూ, ఫిర్యాదుదారుడి నుంచి అక్కడికక్కడే ఫిర్యాదు స్వీకరించారు. ఫిర్యాదు నమోదు అనంతరం ఎఫ్ఐఆర్ కాపీని కూడా ఘటనా స్థలంలోనే బాధితుడికి అందజేశారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఆల్వాల్ ఎస్‌హెచ్‌ఓ తెలిపారు. చోరీకి పాల్పడిన నిందితులను త్వరలోనే గుర్తించి పట్టుకుంటామని పోలీసులు హామీ ఇచ్చారు.

## మెగా 9 టీవీ ఛానెల్, నాదం దినపత్రిక క్యాలెండర్ ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జనవరి 30 మన వార్త :**మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మెగా 9టీవీ చానల్ క్యాలెండర్ ను క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెగా 9 టీవీ చానెల్ ఆవిర్భవించి సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా ఛానెల్ యాజమాన్యానికి, సిబ్బందికి, చానెల్ ను వీక్షించే ప్రేక్షకులకు శుభాకాంక్షలు తెలిపారు. నాణ్యమైన వార్తలను అందిస్తూ ప్రజల సమస్యలపై పోరాడాలని ,ప్రజలకు చేరువయ్యే వార్తలను ప్రచురించాలని కోరారు. ఈ సందర్భంగా మెగా 9 టీవీ ఛానెల్ మీడియా రంగం లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెగా 9టీవీ చానెల్, నాదం దిన పత్రిక ప్రతినిధి సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గద్దర్ 78వ జయంతి వేడుకలు విజయవంతం చేయాలి




**–జనవరి 31న రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహణ...**

**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా జనవరి 30 మన వార్త:** ప్రపంచ ప్రజావాగ్గేయకారుడు, ప్రజాయుద్ధనౌక, తాత్విక వేత్త గద్దర్ 78వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు గద్దర్ ఫౌండేషన్, తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖ సంయుక్తంగా ఏర్పాట్లు పూర్తి చేశాయి. ఈ కార్యక్రమం జనవరి 31, 2026 (శనివారం) న రవీంద్రభారతి, హైదరాబాద్ లో నిర్వహించనున్నట్లు గద్దర్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి, గద్దర్ కుమారుడు గుమ్మడి సూర్యకిరణ్ తెలిపారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలతో వేడుకలు ప్రారంభమవుతాయని తెలిపారు. గద్దర్ జీవిత పోరాటాలు, ప్రజాసంస్కృతి, ప్రజాగీతాల ప్రభావాన్ని ప్రతిబింబించే కళా కార్యక్రమాలు ఈ సందర్భంగా ప్రదర్శించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, హైదరాబాద్ పార్లమెంట్ సభ్యులు అసదుద్దీన్ ఓవైసీతో పాటు పలువురు రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. అలాగే కవులు, కళాకారులు, రాజకీయ నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, వామపక్ష పార్టీల నాయకులు, దళిత గిరిజన వర్గాల మేధావులు, సామాజిక ఉద్యమ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా గద్దర్ గీతాలలో ఒకటైన 'సిరిమల్లె చెట్టు కింద లక్ష్మమ్మ' పాట ఆధారంగా రూపొందించిన పుస్తక సంకలనాన్ని ఆవిష్కరించనున్నట్లు గద్దర్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి జీవి సూర్యకిరణ్ వెల్లడించారు. ప్రజాసంస్కృతి కోసం జీవితాంతం పోరాడిన గద్దర్‌కు ఘన నివాళిగా నిర్వహించే ఈ జయంతి వేడుకల్లో ప్రజలు, అభిమానులు, మేధావులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. జనవరి 31 శనివారం సాయంత్రం రవీంద్రభారతికి హాజరై గద్దర్‌కు నివాళి అర్పించాలని కోరారు.

## ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాటుపడేది సిపిఐనే

**–సిపిఐ అభ్యర్థులను గెలిపించండి...**
**–సిపిఐ అభ్యర్థుల విజయానికి పార్టీ శ్రేణులు సైనికుల్లా పని చేయాలి...**
**–సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు...**
**–5,6,7,8 వార్డుల్లో సిపిఐ అభ్యర్థులు నామినేషన్ దాఖలాలు...**

**మధిర, జనవరి 30( మన వార్త):** ఫిబ్రవరి 11న జరిగే మున్సిపల్ ఎన్నికల్లో సిపిఐ కౌన్సిలర్ అభ్యర్థులుగా పోటీ చేసిన వారిని ప్రజలు ఆదరించి గెలిపించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవి బాబు మధిర మున్సిపాలిటీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మధిర మున్సిపాలిటీ మడపల్లిలో 5,6,7,వార్డులకు, పట్టణంలో 8వ వార్డులో సిపిఐ అభ్యర్థులు నామినేషన్ దాఖలాలు చేశారు. 5వ వార్డుకి పెరుమళ్ళపల్లి వసంత,6వ వార్డుకి ఊట్ల మరుద్వతి,7వ వార్డుకి ఊట్ల కొండలరావు,8వ వార్డుకి బెజవాడ రవిబాబు పోటీ చేశారు. నామినేషన్ దాఖలాల కార్యక్రమంలో పాల్గొన్న రవిబాబు మాట్లాడుతూ,మధిర మున్సిపల్ ఎన్నికల్లో సిపిఐ ఒంటరిగా పోటీ చేస్తుందని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పదవులున్నా లేకున్నా కృషి చేశామని,ఇప్పుడు జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో సిపిఐ కౌన్సిలర్ అభ్యర్థులగా పోటీ చేశారని పోటీలో ఉన్న ప్రతి సిపిఐ అభ్యర్థిని ప్రజల ఆశీర్వదించి గెలిపిస్తే మధిర మున్సిపాలిటీ అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతామని తెలిపారు. సిపిఐ అభ్యర్థుల విజయానికి పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని,పోటీ చేసిన ప్రతి వార్డుని కైవసం చేసుకునేందుకు పాటుపడాలని సూచించారు. ఇందు కోసం ఇప్పటి నుండే ప్రణాళికలు రచించి మున్సిపాలిటీ వార్డు లో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి జిల్లా సమితి సభ్యులు పెరుమాళ్ళపల్లి ప్రకాశరావు,ఊట్ల కామేశ్వరరావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్, తలారి రమేష్, జల్లా బ్రహ్మం,అన్నవరపు సత్యనారాయణ,రంగు నాగరికృష్ణ,పున్నవల్లి అప్పారావు,ఊట్ల పూర్ణచంద్రరావు, చింతపట్ల కృష్ణ, నాగుల్ మీరా,శిలువేరు శ్రీనివాసరావు,గాంధీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ తోనే మధిర మున్సిపాలిటీ అభివృద్ధి

**–అభివృద్ధి కోసం కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి...**
**–కాంగ్రెస్ పార్టీ మండల కార్యదర్శి సూర్యదేవర కోటేశ్వరరావు...**
**–4వ వార్డు ఇల్లందలపాడు కాంగ్రెస్ అభ్యర్థిగా సామినేని సుజాత నామినేషన్ దాఖలాలు...**

**మధిర, జనవరి 30( మన వార్త ):**కాంగ్రెస్ ప్రభుత్వంతోనే మున్సిపల్ అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ పార్టీ మండల కార్యదర్శి సూర్యదేవర కోటేశ్వరరావు అన్నారు. శుక్రవారం మధిర మున్సిపల్ కౌన్సిలర్ల నామినేషన్ల దాఖలు సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సామినేని సుజాత మధిర మున్సిపాలిటీలోని ఇల్లందులపాడు 4వ వార్డ్ కు నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా సూర్యదేవర కోటేశ్వరరావు మాట్లాడుతూ,డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సహకారంతో మధిర మున్సిపాలిటీలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. గతంలో మున్సిపాలిటీని పాలించిన బి ఆర్ ఎస్ మధిర అభివృద్ధిని పట్టించుకోలేదని,ప్రజల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని ఆరోపించారు.మున్సిపాలిటీ అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలంటే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు స్వామి రామనాథం,ఎస్సీ సెల్ అధ్యక్షుడు కోట డేవిడ్, గోపీనాథ్,బోడేపూడి తదితరులు పాల్గొన్నారు.



## సమ్మక్క సారలమ్మ జాతర మహోత్సవాల్లో పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్న సెస్ డైరెక్టర్ వరుస కృష్ణ హరి, జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి



**రాజన్న సిరిసిల్ల జిల్లా, ఎల్లారెడ్డిపేట మండలం మన వార్త ప్రతినిధి జనవరి 30:** అమ్మవార్లను దర్శించుకుని మొక్కలు చెల్లించారు సర్పంచ్ ఇల్లందుల గీతాంజలి శ్రీనివాస్ రెడ్డి, మరియు ఉప సర్పంచ్ వెంకట్ రెడ్డి ,వార్డ్ నెంబర్లు కొత్త ప్రసాదు, చంద్రం, బొమ్మవేని కృష్ణ, బొమ్మనేని వెంకటేష్, మరియు దూస శీను, హసన్ భాయ్ నవ సంజీవ్ రెడ్డి ,బంటి, సింగారం మధు తదితరులు పాల్గొన్నారు

## నామినేషన్ కేంద్రాన్ని సందర్శించి,నామినేషన్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జనవరి 30( మన వార్తా ప్రతినిధి )**కొత్తగూడెం మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కొత్తగూడెం మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన నామినేషన్ల ప్రక్రియను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల వద్ద విధులలో ఉన్న పోలీసు అధికారులు,సిబ్బందికి పలు సూచనలు చేశారు. నామినేషన్ కేంద్రాల పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని,అభ్యర్థులు మరియు వారి అనుచరులు ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించేలా చూడాలని ఎస్పీ ఆదేశించారు. గుంపులు గుంపులుగా రావడం,నినాదాలు చేయడం, ర్యాలీలు నిర్వహించడం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేపడతామని తెలియజేశారు. సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణ,మెటల్ డిటెక్టర్లు,బారికేడ్లు,ట్రాఫిక్ నియంత్రణ వంటి భద్రతా చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ ఎన్నికల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలని కోరారు. జిల్లాలో శాంతియుత,స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణకు పోలీస్ శాఖ పూర్తిగా కట్టుబడి ఉందని జిల్లా ఎస్పీ ఈ సందర్భంగా తెలిపారు.

## 20 ఏళ్ల బిసి ఉద్యమం నుంచి కార్పొరేషన్ పోరుకు కురిమెల్ల శంకరయ్య



**–25 వ డివిజన్ బీఎస్పీ అభ్యర్థిగా నామినేషన్...**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జనవరి 30( మన వార్తా ప్రతినిధి )**కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని 25వ జనరల్ వార్డు నుంచి బహుజన్ సమాజ్ పార్టీ అభ్యర్థిగా కురిమెల్ల శంకరయ్య నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ ప్రక్రియ పూర్తి అయిన అనంతరం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆయనకు ధృవపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కురిమెల్ల శంకరయ్య మాట్లాడుతూ, గత 20 సంవత్సరాలుగా దేశంలో బీసీలకు జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నిస్తూ ఉద్యమ మార్గంలో పోరాటం చేస్తున్నానని తెలిపారు. బీసీలకు రాజకీయ అధికారం సాధించాలంటే బహుజన్ సమాజ్ పార్టీ ద్వారానే సాధ్యమని నమ్మి పార్టీలో చేరి, కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు చెప్పారు. స్వతంత్ర భారతదేశానికి 70 సంవత్సరాలు పూర్తయినా బీసీలకు జనాభా దామాషా ప్రకారం రాజకీయ ప్రాతినిధ్యం లభించకపోవడం దురదృష్టకరమని ఆయన అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల ప్రజలు తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. అగ్రవర్ణ పార్టీల ఆధిపత్యానికి గట్టి బుద్ధి చెప్పాలని పిలుపునిస్తూ, 25వ డివిజన్ నుంచి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను విజ్ఞప్తిచేశారు. ఈకార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా ఇన్చార్జి తాంద్ర వెంకటేశ్వర్లు పాల్గొన్నారు

## బిల్డింగ్ ప్లానింగ్ మార్చాలి అడిషనల్ కలెక్టర్ కు వినతి



**–ఎస్ ఎఫ్ ఐ విద్యార్థి సంఘ నాయకులు...**

**మధిర,జనవరి30( మన వార్త):**మధిర మండలం సిరిపురం గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా హై స్కూల్ మరియు జూనియర్ కళాశాల గ్రౌండ్ను నిరుపయోగంగా మార్చే విధంగా ఐటిఐ కళాశాల బిల్డింగ్ నిర్మాణం రూపొందించడం ను నిరసిస్తూ స్థానిక విద్యార్థులు యువకులు గత కొన్ని రోజులుగా ఆందోళన తెలియజేస్తున్నారు. విద్యార్థుల సమస్యను అర్థం చేసుకొని పరిష్కరించాల్సింది పోయి మొండి వైఖరితో అధికార పార్టీ నాయకులు గ్రౌండును నిరోపియోగంగా మార్చే విధంగా బిల్డింగ్ నిర్మాణాన్ని చేపట్టడానికి పూనుకున్నారు. దీనిని నిరసిస్తూ సరైన పద్ధతిలో బిల్డింగ్ నిర్మాణం చేపట్టాలని కోరుతూ ఖమ్మం జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి నీ కలసి సమస్య వివరించి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్ మాట్లాడుతూ విద్యార్థులకు ఆటస్థలం చాలా ముఖ్యమని ఉన్న స్థలాన్ని సద్వినియోగపరచుకొని ఆటస్థలం ఏర్పాటుకు అధికారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సెకండరీ స్కూల్ బోర్డ్ మరియు బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ పరిధిలో ఉన్న స్థలాన్ని ఐటిఐ కళాశాలకు కేటాయించడం ఉన్న ఆట స్థలాన్ని నిర్వీర్యం చేయడం వల్ల విద్యార్థులకు తీవ్రమైన నష్టం జరుగుతుందని గుర్తించాలని డిమాండ్ చేశారు. ఐటిఐ కళాశాల నిర్మాణం కొరకు సెకండరీ స్కూల్ మరియు ఇంటర్మీడియట్ బోర్డ్ తమ స్థలాన్ని వదులుకొని ఐటిఐ కళాశాల బిల్డింగ్ నిర్మాణం కొరకు అనుమతి ఇచ్చారా? అలాంటి అనుమతి ఉంటే బహిరంగపరచాలని డిమాండ్ చేశారు. అనుమతులు లేకుండానే బిల్డింగ్ నిర్మాణం చేపట్టడం ఎవరి మెప్పు పొందడం కోసం అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మధిర డివిజన్ నాయకులు దొడ్డ వేణు జిల్లా నాయకులు త్రినాథ్ ఖమ్మం డివిజన్ ప్రెసిడెంట్ నాయకులు లోకేష్ సుజిత్ వంశీ ,లక్ష్మిష నారాయణ ,రాఘవ, జ్యోతి ప్రకేశ్ , , కార్తీక్ సతీష్ .శామ్ . ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు

## వారం రోజుల్లోనే దొంగలను పట్టుకున్న పోలీసులు



**–అభినందించిన డిఎస్పీ సైదా నాయక్...**

**జహీరాబాద్, జనవరి 30 (మన వార్త):** వారం రోజుల క్రితం జరిగిన దొంగతనాన్ని జహీరాబాద్ పోలీస్ లు ఛాలెంజ్ గా తీసుకుని దొంగలను పట్టుకున్నారు. శుక్రవారం జహీరాబాద్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశములో డిఎస్పీ సదా నాయక్, సీఐ శివలింగం, ఎస్ఐ వినయ్ కుమార్ లు దొంగతనాలకు సంబంధించిన పలు విషయాలను వెల్లడించారు. ఈ నెల 22 న జహీరాబాద్ పట్టణంలో ఓ మహిళ మెడ నుండి ఇద్దరు దొంగలు పుస్తేల తాడు తస్కరించుకుని పారిపోయిన దొంగలను పట్టుకున్నట్లు డిఎస్పీ తెలిపారు. జిల్లా ఎస్పీ సూచనల మేరకు స్థానిక డిఎస్పీ సైదా నాయక్ ఆధ్వర్యంలో, సీఐ శివలింగం నిఘాలో పట్టణ ఎస్ఐ కె వినయ్ కుమార్ సిబ్బందితో కలిసి మూడు టీమ్ లుగా ఏర్పడి దొంగల కొరకు గాలిస్తుండగా, శుక్రవారం ఉదయం 7 గంటలకు జహీరాబాద్ బైపాస్ అల్గోల్ రోడ్డు కూడలి వద్ద పల్సర్ బైక్ పై ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి హైదరాబాద్ వైపు నుండి బీదర్ వైపు పారిపోతుండగా, అనుమానం వచ్చి వారిని ఆపి విచారించారన్నారు. ఒకరు ఆయాజ్ (24) తండ్రి అభేద్ గా, ఇంకొకరు నిజాం (31) నివాసం పటాన్ చేరు అని తెలిపి 22 వ తేదీన చేసిన దొంగతాన్ని ఒప్పుకున్నారన్నారు. నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుండి 2 తులాల 5 గ్రాముల బంగారు పుస్తేల తాడు (విలువ 470000/-), రెండు కత్తులను, బైక్ ను స్వాధీన పరుచుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. దొంగలను పట్టుకోవడానికి రాత్రి పగలు కృషి చేసిన సీఐ శివలింగం ను, ఎస్ఐ వినయ్ కుమార్ ను, ఐడి పార్టీ సిబ్బంది, కానిస్టేబుల్ ఓందేవ్, అస్లాం, పృథ్వీ, హరినేత్ర, ఆనంద్ లను డిఎస్పీ సైదా నాయక్ అభినందించి, రివార్డ్ రూల్ కొరకు పై అధికారుల కు సిఫార్సు చేసినట్లు వివరించారు.

## పిఎం శ్రీ తెలంగాణ ప్రభుత్వ ఆదర్శ పాఠశాల అండ్ కళాశాల లో ఘనంగా కల మరియు కర కౌశల ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ప్రదర్శన

**నిజామాబాద్ జిల్లా సిరికొండ ( మన వార్త) జనవరి 30** సిరికొండ మండల కేంద్రంలో పీఎం శ్రీ తెలంగాణ ప్రభుత్వ ఆదర్శ పాఠశాల & కళాశాల లో ఘనంగా కళా మరియు కరకౌశల (Art Ê Craft) ప్రదర్శన – విద్యార్థుల ప్రతిభకు అద్దం పట్టిన సృజనాత్మకత. సిరికొండ మండల కేంద్రంలోని పీఎం శ్రీ తెలంగాణ ప్రభుత్వ ఆదర్శ పాఠశాల & కళాశాల ఆవరణలో విద్యార్థుల సృజనాత్మకతను చాటిచెప్పేలా నిర్వహించిన "కళా మరియు కరకౌశల ప్రదర్శన" (Art and Craft Elhibition) విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసే ఉద్దేశంతో పాఠశాల ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో ఈ ప్రదర్శనను అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రదర్శన విశేషాలు: ఈ కార్యక్రమానికి హాజరైన ఉపాధ్యాయులు మాట్లాడుతూ, "నేటి విద్యా విధానంలో కేవలం పుస్తక పఠనమే కాకుండా, ఇలాంటి కళా ప్రదర్శనల ద్వారా విద్యార్థులలో ఆలోచనా శక్తి మరియు సృజనాత్మకత పెరుగుతాయి అని తెలియజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని, ఈ ప్రదర్శన విజయవంతం కావడానికి సహకరించిన ఉపాధ్యాయ బృందానికి మరియు విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు.

## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ వర్ధంతి వేడుకలు



**బెజ్జంకి, జనవరి 30( మన వార్త ప్రతినిధి )**సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహాత్మగాంధీ 78వ వర్ధంతి వేడుకలలో భాగంగా గాంధీ విగ్రహానికి పూల మాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం బెజ్జంకి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి మాట్లాడుతూ జాతిపిత మహాత్మగాంధి అహింస మార్గాన్ని ఎంచుకొని బలగంగాధర్ తిలక్, సుభాష్ చంద్రబోస్,గోకుల్ లాంటి మహానుభావులను కలుపు కొని తెల్ల దొరలకు దిటుగావిదేశీ వస్త్ర బహిష్కరణ,ఉప్పు సత్యాగ్రహం,క్విట్ ఇండియా,సహాయనిరకరణ,వంటి ఎన్నోఉద్యమాలు చేసి ఎన్నో సార్లు జైలు జీవితం గడిపిన మన జాతిపిత మహాత్మా గాంధీ మనదేశనికి స్వాతంత్రం వచ్చే దాకా పోరాడిన యోధుడు అలాంటి మహానుభావుడి అయన ఆశయాలను స్ఫూర్తి గా ఆధార్షంగా తీసుకొని ప్రతి ఒక్క యువత రాజకీయాల్లో ఎదగాలని రాజ్య భవిష్యత్తు రానున్న రోజుల్లో యువతనే కీలక పాత్ర పోషిస్తుందని నమ్మిన వ్యక్తి మన జాతిపిత మహాత్మా గాంధీ మనందరం కలిసి అయన కళలను సహకారం చేయాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో బెజ్జంకి మండల అధ్యక్షులు ముక్కిస రత్నాకర్ రెడ్డి, ఏఎంసి వైస్ చేర్మెన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ అక్కరవేణి పోశయ్య,, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కర్రవుల సందీప్, మాజీ సర్పంచి రావుల నరసయ్య, ఐలేని శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## చెబర్తి లో మహాత్మా గాంధీకి ఘన నివాళి




**గజ్వేల్ జనవరి 30 మన వార్త ప్రతినిధి** సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం చెబర్తి లో శుక్రవారం మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ ర్యాకం యాదగిరి, బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు బబ్బూరు రాందాస్ గౌడ్,సారధి ఫౌండేషన్ చైర్మన్ గుడాల శేఖర్ గుప్త ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు అనంతరం వారు మాట్లాడుతూ అహింస మార్గం ద్వారా భారత దేశానికి స్వతంత్రం తెచ్చిన మహాత్మా గాంధీ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని,గ్రామాలు దేశానికి పట్టు కొమ్మలు అన్న మహాత్మా గాంధీ చూపిన బాటలో నడవాలని గ్రామ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ శ్రీకాంత్, వార్డ్ సభ్యులు, గ్రామ పాలక వర్గం,మాజీ ఉప సర్పంచ్ స్వామి,సీనియర్ నాయకులు నయీం షరీఫ్,సంజీవ్, జాలని యాదగిరి, చిన్ని కృష్ణ,గుడాల నరేశ్,కొత్త శ్రీనివాస్, కొంతం యాదగిరి,కరుణాకర్, బాలాజీ న్యూరో గజ్వేల్ హాస్పిటల్ యాజమాన్యం, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## కేరళ మోడల్ స్కూల్‌లో షహీద్ దివస్..

**–ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో స్మరణ కార్యక్రమం...**

**ఇల్లంతకుంట,జనవరి 30 (మన వార్త ప్రతినిధి);**మహాత్మా గాంధీ జయంతి మరియు స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ శుక్రవారం ఇల్లంతకుంట మండలం వల్లంపట్ల గ్రామంలోని కేరళ మోడల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో అమరవీరుల దినోత్సవం (షహీద్ దివస్) ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని పాఠశాల కరస్పాండెంట్ శ్రీరాముల శ్రీధర్ ఆధ్వర్యంలో చేపట్టారు. కార్యక్రమం ప్రారంభంలో ఉపాధ్యాయులు,ఉపాధ్యాయురాళ్లు,విద్యార్థులు అందరూ కలిసి రెండు నిమిషాల మౌనం పాటించి అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. అనంతరం పుష్పగుచ్ఛాలు సమర్పించి వీరుల త్యాగస్ఫూర్తిని స్మరించుకున్నారు. ప్రత్యేక సమావేశంలో ప్రసంగాల ద్వారా స్వాతంత్ర్య సమరయోధుల సేవలను గుర్తుచేశారు. దేశభక్తి గీతాలను విద్యార్థులు ఆలపించడం ద్వారా జాతీయ భావాలను పెంపొందించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ఉపాధ్యాయులు,ఉపాధ్యాయురాళ్లు సమన్వయంతో నిర్వహించగా,వారు విద్యార్థులకు అమరవీరుల త్యాగాలు,మహాత్మా గాంధీ ఆశయాలు,దేశభక్తి మరియు జాతీయ విలువల ప్రాధాన్యతను వివరించి కార్యక్రమాన్ని మరింత అర్థవంతంగా తీర్చిదిద్దారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



## సిబ్బంది రాండమైజేషన్ ప్రక్రియ పూర్తి



**మంచిర్యాల, జనవరి 30 (మన వార్త ప్రతినిధి):**రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా జిల్లాలో ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఎన్నికల సందర్భంగా జరుగుతున్న పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేందుకు పోలింగ్ సిబ్బంది రాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్లలో ఏర్పాటు చేసిన 265 పోలింగ్ కేంద్రాలకు గాను, 265 మంది పిఓ లతో పాటు 20 శాతం అదనంతో 53 మంది రిజర్వ్ పిఓలు, 265 మంది ఎపిఓ లతో పాటు 20 శాతం అదనంతో 53 మంది ఎపిఓలు, 795 మంది ఓపిఓ లతో పాటు 20 శాతం అదనంతో 159 మంది ఓపిఓ లను రాండమైజేషన్ జరిగిందని తెలిపారు. బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని 34 వార్డులలో ఏర్పాటు చేసిన 68 పోలింగ్ కేంద్రాలకు గాను, 68 మంది పిఓ లతో పాటు 20 శాతం అదనంతో 14 మంది రిజర్వ్ పిఓలు, 68 మంది ఎపిఓ లతో పాటు 20 శాతం అదనంతో 14 మంది ఎపిఓలు, 204 మంది ఓపిఓ లతో పాటు 20 శాతం అదనంతో 41 మంది ఓపిఓ లను రాండమైజేషన్ జరిగిందని తెలిపారు. చెన్నూర్ మున్సిపల్ పరిధిలోని 18 వార్డులలో ఏర్పాటు చేసిన 36 పోలింగ్ కేంద్రాలకు గాను, 36 మంది పిఓ లతో పాటు 20 శాతం అదనంతో 7 మంది రిజర్వ్ పిఓలు, 36 మంది ఎపిఓ లతో పాటు 20 శాతం అదనంతో 7 మంది ఎపిఓలు, 108 మంది ఓపిఓ లతో పాటు 20 శాతం అదనంతో 22 మంది ఓపిఓ లను రాండమైజేషన్ జరిగిందని తెలిపారు. క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని 22 వార్డులలో ఏర్పాటు చేసిన 45 పోలింగ్ కేంద్రాలకు గాను, 45 మంది పిఓ లతో పాటు 20 శాతం అదనంతో 9 మంది రిజర్వ్ పిఓలు, 45 మంది ఎపిఓ లతో పాటు 20 శాతం అదనంతో 9 మంది ఎపిఓలు, 135 మంది ఓపిఓ లతో పాటు 20 శాతం అదనంతో 27 మంది ఓపిఓ లను రాండమైజేషన్ జరిగిందని తెలిపారు. లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని 15 వార్డులలో ఏర్పాటు చేసిన 15 పోలింగ్ కేంద్రాలకు గాను, 30 మంది పిఓ లతో పాటు 20 శాతం అదనంతో 6 మంది రిజర్వ్ పిఓలు, 30 మంది ఎపిఓ లతో పాటు 20 శాతం అదనంతో 6 మంది ఎపిఓలు, 90 మంది ఓపిఓ లతో పాటు 20 శాతం అదనంతో 18 మంది ఓపిఓ లను రాండమైజేషన్ జరిగిందని తెలిపారు. సిబ్బంది తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. అధికారులకు అవసరమైన శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తల మీదే రక్షణ మీదే హెల్మెట్ ధారణ ప్రాణ రక్షణ.సంగం వెంకట పుల్లయ్య మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్



**భద్రాచలం జనవరి 30 (మనవార్త ప్రతినిధి )**భద్రాచలం.తల మీదే రక్షణ మీదే" అనే సత్యాన్ని ప్రతి ద్విచక్ర వాహన చోదకుడు గుర్తించి, తప్పనిసరిగా హెల్మెట్ ధరించి తన విలువైన ప్రాణాన్ని కాపాడుకోవాలని సంగం వెంకట పుల్లయ్య మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్ కోరారు. శుక్రవారం నాడు భద్రాచలం రవాణా శాఖ యూనిట్ కార్యాలయంలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు సందర్భంగా మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్ వెంకట పుల్లయ్య, అసిస్టెంట్ మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్ బి రాజశేఖర్ రెడ్డి సిబ్బంది కార్యాలయంకు వచ్చిన వారి హెల్మెట్లకు నన్ను ధరించి నిన్ను రక్షిస్తా అనే నినాదం గల రేడియం స్టిక్కర్లను అంటించి, హెల్మెట్ ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా వెంకట పుల్లయ్య మాట్లాడుతూ, ప్రతి ద్విచక్ర వాహన చోదకుడు నాణ్యమైన హెల్మెట్‌ను తలకు సరిగ్గా ధరించి, మెడ వద్ద బెల్ట్ క్లిప్‌ను సరైన విధంగా పెట్టుకొని ప్రయాణం చేయాలని సూచించారు. హెల్మెట్‌ను సక్రమంగా ధరిస్తే, రోడ్డు ప్రమాదం జరిగిన సందర్భంలో కూడా తలకు తీవ్రమైన గాయాలు తగలకుండా ప్రాణాలను కాపాడుకోవచ్చని వివరించారు. మనము జీవించి ఉంటేనే మన కుటుంబానికి మనం రక్షణగా నిలబడగలమని, అందువల్ల హెల్మెట్ ధారణను ఒక అలవాటుగా మార్చుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క పౌరుడిపై ఉందని తెలిపారు. అలాగే మన కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులకు కూడా హెల్మెట్ ప్రాధాన్యతను వివరించి, వారిని ఈ అలవాటుకు ప్రోత్సహించాలని కోరారు. తల మీదే రక్షణ మీదే హెల్మెట్ ధారణ ప్రాణ రక్షణ అనే సత్యాన్ని ప్రతి ఒక్కరూ ఎప్పటికీ మర్చిపోవద్దని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. అదేవిధంగా సెల్‌ఫోన్ ఉపయోగించి డ్రైవింగ్ చేయడం, మద్యం మత్తులో, నిద్ర మత్తులో, అతి వేగంతో వాహనాలు నడపడం ప్రమాదకరమని తెలిపారు. రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించి, రోడ్డు ప్రమాదాలను అరికట్టి తమతో పాటు ఇతర రోడ్డు వినియోగదారుల విలువైన ప్రాణాలను కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బి. రాజశేఖరరెడ్డి, ఏ ఎమ్ వి ఐ, కానిస్టేబుల్ ఎన్. శివయ్య, సిబ్బంది భీముడుతో పాటు కార్యాలయంలో వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు పాల్గొన్నారు.

## సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికలు బీఎస్పీ అభ్యర్థులుగా పట్టణ అధ్యక్షుడు అరకల రమేష్‌తో పాటు ముగ్గురి నామినేషన్



**సిరిసిల్ల వార్త ప్రతినిధి:–** రాజన్న సిరిసిల్ల జిల్లా:రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల మున్సిపాలిటీ ఎన్నికల పోరు రసవత్తరంగా మారుతోంది. ఈ క్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ (BSP) తన దూకుడును పెంచింది. బుధవారం మున్సిపాలిటీ ఎన్నికల బరిలో నిలిచే నలుగురు బీఎస్పీ అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. అట్టహాసంగా నామినేషన్ల ప్రక్రియసిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు అరకల రమేష్ తో పాటు జోష్న, భాను మరియు మరో అభ్యర్థి కలిసి మున్సిపల్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి తమ నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముందు అభ్యర్థులు,పార్టీ నాయకులు కలిసి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంబేద్కర్ ఆశయ సాధనకై తాము పనిచేస్తామని ఈ సందర్భంగా వారు ప్రతిజ్ఞ చేశారు. సామాజిక న్యాయమే లక్ష్యం: అభ్యర్థులునామినేషన్ అనంతరం అభ్యర్థులు మీడియాలో మాట్లాడుతూ.. వార్డుల సమగ్ర అభివృద్ధి, సామాజిక న్యాయం కోసం నిరంతరం శ్రమిస్తామని హామీ ఇచ్చారు. సామాన్య ప్రజల గొంతుకగా మున్సిపాలిటీలో అడుగుపెడుతున్నామని, తమను గెలిపించాలని కోరారు. పాల్గొన్న ముఖ్య నాయకులుఈ కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి ఎనగందుల వెంకన్న, జిల్లా ఇంచార్జ్ కొమ్మటా అశోక్ తో పాటు పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అభ్యర్థుల నామినేషన్ ప్రక్రియ విజయవంతం కావడంతో బీఎస్పీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. ఈ ఎన్నికల్లో బీఎస్పీ జెండా ఎగురవేయడం ఖాయమని నాయకులు ధీమా వ్యక్తం చేశారు.

## తెలంగాణ హైకోర్ట్ బార్ కౌన్సిల్ ఎన్నికల్లో సుదగోని శ్రీనాథ్ గౌడ్..



**ఇల్లంతకుంట,జనవరి 30 (మన వార్త ప్రతినిధి);**తెలంగాణ హైకోర్ట్ బార్ అసోసియేషన్ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం సిరిసిల్లలో ఓటు హక్కును వినియోగించిన అడ్వకేట్,ఇల్లంతకుంట మండల మాజీ వైస్ ఎంపీపీ సుదగోని శ్రీనాథ్ గౌడ్ ఎన్నికల ప్రక్రియలో చురుకుగా పాల్గొన్నారు. సుదగోని శ్రీనాథ్ గౌడ్ ఈ సందర్భంగా న్యాయవాదుల హక్కులను ప్రాముఖ్యతనిచ్చి,ప్రతిష్ఠాత్మక ఎన్నికల్లో చురుకైన,బాధ్యతాయుతమైన విధానాన్ని చూపారు. స్థానిక న్యాయవాదులు మరియు రాజకీయ నాయకులు ఆయన పాల్గొనడం పై సంతృప్తి వ్యక్తం చేశారు.

## నామినేషన్ల స్వీకరణలో గడువు సమయాన్ని ఖచ్చితంగా అమలు చేయాలి



**–జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్...**

**మంచిర్యాల, జనవరి 30 (మన వార్త ప్రతినిధి):** మున్సిపల్ ఎన్నికలలో భాగంగా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలో సమయపాలన కచ్చితంగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి అన్వేష్, కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్ లతో కలిసి సందర్శించి నామినేషన్ల ప్రక్రియ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ, నామినేషన్ల ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని, నామినేషన్ల స్వీకరణలో సమయపాలన ఖచ్చితంగా పాటించాలని, సాయంత్రం 5 గంటలకు గేటు మూసివేయాలని, గేటు లోపల ఉన్నవారికి టోకెన్లు అందజేసి వరుస క్రమంలో నామినేషన్లు స్వీకరించాలని, రిటర్నింగ్ అధికారులు నామినేషన్ల స్వీకరణలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ కొరకు టేబుళ్లు ఏర్పాటు చేయడం జరిగిందని, నామినేషన్ దరఖాస్తులు నింపడం, జతపరచవలసిన పత్రాలు, ఇతర వివరాల కొరకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. నామినేషన్ దరఖాస్తులు పూర్తి చేసిన అభ్యర్థులు హెల్ప్ డెస్క్ వద్ద పరిశీలించుకుని సరైన నామినేషన్లు దాఖలు చేయాలని తెలిపారు. 31వ తేదీన నామినేషన్లు పరిశీలించి అర్హత గల అభ్యర్థుల జాబితా ప్రకటన, ఫిబ్రవరి 1వ తేదీన నామినేషన్లపై అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణ, 2వ తేదీన అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కారం, 3వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా ప్రకటన జరుగుతుందని తెలిపారు. ఫిబ్రవరి 11వ తేదీన పోలింగ్, 12వ తేదీన రీపోలింగ్ (ఏమైనా ఉన్నట్లయితే), 13వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టి గెలుపొందిన అభ్యర్థుల ప్రకటన జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ నం.08736-250501 ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికల సంబంధించిన సమాచారం, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన పై ఫిర్యాదుల కొరకు సంప్రదించవచ్చని తెలిపారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ టీ పౌడర్ పట్టివేత



**హనుమకొండ జిల్లా (మన వార్త) ప్రతినిధి జనవరి 30**హన్మకొండ జిల్లా:::గూడెప్పాడు సెంటర్ లోని యం యం మార్ట్ లో ఆహార భద్రత అధికారులు నకిలీ టీ పౌడర్ ను స్వాదీనం చేసుకున్నారు. ఈ మార్ట్ లో ప్రాణాంతక క్యాన్సర్ కు కారణమైన జుట్టుకు వేసే కలర్ తో తయారు చేసిన టీ పౌడర్ విక్రయిస్తున్నారు. దింతో ఈ మార్ట్ లో తనిఖీలు చేసిన గెజిటెడ్ ఫుడ్ ఇన్స్పెక్టర్లు కృష్ణమూర్తి, ఫుడ్ మౌనిక నకిలీ టీ పౌడర్ ను గుర్తించారు. నకిలీ టీ పౌడర్ ను స్వాధీనంచే సుకున్న వారు నకిలి వస్తువుల పట్ల అవగాహన కలిగి ఉండి నకిలీ ఏదో, అస్లీ ఏదో గుర్తించాలని ఎలా గుర్తించాలో మీడియా ముందు వివరించారు. టీ పౌడర్ లో నీళు పోయగానే రంగులోకి మారితే అది నకిలీ అని, రంగు మారకుంటే అది అస్లీ అని ఫుడ్ ఇన్స్పెక్టర్ అన్నారు ఈ తనిఖీల్లో శాయంపేట సిఐ రంజిత్ రావు, ఎస్సై పరమేశ్వర్ పాల్గొన్నారు.

## 15 వ వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన పుల్లమినమ్మ బీరయ్య



**గజ్వేల్ జనవరి 30, మన వార్త ప్రతినిధి** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో 15,వ వార్డు బి ఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి సంగుపల్లి నుంచి పోటీ చేస్తున్న పుల్లమినమ్మ బీరయ్య నామినేషన్ కు సంగుపల్లి నుంచి తరలివచ్చిన గ్రామస్తులు. ఐఓసీ సమీపంలో భారీ ర్యాలీగా వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కౌన్సిలర్ అభ్యర్థిగా మీ ముందుకు వస్తున్నానని వార్డ్ అభివృద్ధి ధ్యేయంగా ప్రజా సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తానని 15, వ వార్డు ప్రజలు ఆశీర్వదించాలని కోరారు తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సారాధ్యంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధి సంక్షేమంలో 50 సంవత్సరాలకు ముందుకు వెళ్లిందన్నారు కెసిఆర్ హయాంలో గజ్వేల్ లోని తూప్రాన్ రోడ్డు నుండి ప్రజ్ఞాపూర్ రోడ్డు వరకు ఇరువైపులా డివైడర్ తోపాటు బటర్ఫ్లై లైట్ల ఏర్పాటు , గజ్వేల్లో ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ లాంటి డి ఆఫీసులను ఏర్పాటుచేసిన ఘనత కేసిఆర్ ది అన్నారు కానీ నేడు అబద్దాల పునాదుల మీద రాజ్యమేలుతున్న కాంగ్రెస్ రేవంత్ రెడ్డి సర్కార్ ప్రజలకు ఇచ్చిన హామీలలో పూర్తిగా విఫలమైందన్నారు ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ జై జైల వెంకటేష్ గౌడ్, పుల్ల బీరయ్య నల్ల మాధవరెడ్డి బిల్దే కిషన్ గౌడ్ బి ఆర్ఎస్ కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## ఉచిత ఓల్వో ఆపరేటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



**మందమర్రి, జనవరి 30 (మన వార్త ప్రతినిధి):** సింగరేణి ప్రభావిత గ్రామ, సింగరేణి కార్మిక కుటుంబాల పిల్లలకు ఉచిత ఓల్వో డంప్ ట్రక్ ఆపరేటర్ శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, ఈ శిక్షణను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. వోల్వో డంప్ ట్రక్ ఆపరేటర్ శిక్షణ కోసం 10వ తగరతి ఉత్తీర్ణులై ఉండి, భారీ మోటార్ వాహన డ్రైవింగ్ లైసెన్స్, 3 యేండ్ల అనుభవం కలిగి ఉండాలని సూచించారు. మొదటి విడతగా ఫిబ్రవరి 2 నుండి 21 వరకు 18 రోజులపాటు శిక్షణ నివ్వనున్నట్లు తెలిపారు. మొత్తం 60 మంది అభ్యర్థులకు గాను ప్రతి ఏరియా నుండి అర్హత కలిగిన 5గురిని ఎంపిక చేసి, శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు మరిన్ని వివరాల కోసం ఏరియా ఎంవిటిసి కార్యాలయంలో మేనేజర్ ని సంప్రదించాలని సూచించారు.

## ఘనంగా సమ్మక్క సారలమ్మ జాతర మహోత్సవం



**మనవార్త ముస్తాబాద్ జనవరి 30** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర మహోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నారు గురువారం రోజున బోనాలు పురవీధుల గుండా ఊరేగింపుగా తీసారు జాతర ఆదివారం వరకు కొనసాగుతుందని నిర్వాహకులు రాజమల్లయ్య తెలిపారు ఈ కార్యక్రమంలో గీస బిక్షపతి నిర్వాహకులు భక్తులు పాల్గొన్నారు

## మచ్చ బొల్లారం 2.38 కోట్లతో బీటీ రోడ్డు అభివృద్ధికి స్టాండింగ్ కమిటీ ఆమోదం




**మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, జనవరి 30 మన వార్త :** అల్వాల్ సర్కిల్ పరిధిలోని డివిజన్ 133 మచ్చ బొల్లారంలో ప్రజలకు ఏళ్లుగా తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్న బీటీ రోడ్డుకు శాశ్వత పరిష్కారం దిశగా కీలక ముందడుగు పడింది. సెలెక్ట్ టాకీస్ నుంచి మచ్చ బొల్లారం వాటర్ ట్యాంక్ వరకు ఉన్న తీవ్రంగా దెబ్బతిన్న బీటీ రోడ్డును అభివృద్ధి చేయడానికి 2.38 కోట్ల 238 లక్షలు అంచనా వ్యయంతో పనులకు జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ పరిపాలనా అనుమతి మంజూరు చేసింది. డివిజన్ కార్పొరేటర్ రాజ్ జెతేందర్ నాథ్ గత సంవత్సరం ఆగస్టు 2025లో జిహెచ్ఎంసి కమిషనర్‌కు సమగ్ర నివేదిక సమర్పించి, డివిజన్ 133 పరిధిలోని పలు కాలనీల్లో సీసీ రోడ్లు, బీటీ రోడ్ల అభివృద్ధి, మౌలిక వసతుల మెరుగుదల అత్యవసరమని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రతిపాదనలను సాంకేతికంగా పరిశీలించిన అనంతరం, ప్రీంబుల్‌ను సీరియల్ నంబర్ 25గా లిస్టులో చేర్చి, 2026 జనవరి 21న నిర్వహించిన 11వ జనరల్ స్టాండింగ్ కమిటీ సమావేశంలో చర్చకు తీసుకువచ్చారు. అనంతరం నిన్న ఈ ముఖ్యమైన పనులకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. సెలెక్ట్ టాకీస్ నుంచి మచ్చ బొల్లారం వాటర్ ట్యాంక్ వరకు ఉన్న ఈ రహదారి అనేక నివాస కాలనీలను, కొంపల్లి బొల్లారం హైవేను, రైల్వే స్టేషన్‌ను అనుసంధానించే కీలక మార్గం. రోడ్డుస్థితి అధ్వాన్నంగా ఉండటంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో బీటీ రోడ్డును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడం ద్వారా ప్రజల సమస్యలకు ఉపశమనం కలగనుంది. ఈ సందర్భంగా కార్పొరేటర్ రాజ్ జెతేందర్ నాథ్ మాట్లాడుతూ, ఈ అభివృద్ధి పనులకు అనుమతి మంజూరు చేసినందుకు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ స్టాండింగ్ కమిటీ సభ్యులు మరియు జిహెచ్ఎంసి అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. డివిజన్ 133లో మిగిలిన అభివృద్ధి ప్రతిపాదనలను కూడా ముందుకు తీసుకెళ్లి, మచ్చ బొల్లారం సమగ్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

## వైజ్ఞానిక ప్రదర్శనలలో రాణించిన విద్యార్థులకు మేమోంటోలు అందచేత

**రాజన్న సిరిసిల్ల జిల్లా, గంభీరావుపేట్ మండల్ మన వార్త ప్రతినిధి జనవరి 30:** దమ్మన్నపేట గ్రామంలోని, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దమ్మన్నపేట, విద్యార్థులు గత నాలుగు సంవత్సరాలుగా వైజ్ఞానిక ప్రదర్శనలో రాణిస్తూ ఉండడాన్ని గమనించిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు గంభీరావుపేట వాస్తవ్యురాలు ఈరవేని స్వప్న, ఈరోజు వారందరికీ మెమెంటోలు అందజేసి అభినందనలు తెలియజేయడం జరిగిందని పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు బోయన్న గారి నారాయణ తెలిపారు రాష్ట్రస్థాయి మరియు జాతీయస్థాయిలో పాల్గొని విజేతలుగా నిలిచిన విద్యార్థులందరికీ సుమారు 28, మంది విద్యార్థులకు మేమోంటోలు అందజేయడం జరిగిందని, ఈ సందర్భంగా నారాయణ, తెలిపారు విద్యార్థులను ప్రోత్సహించేందుకు ముందుకు వచ్చిన ఈరవేని స్వప్న,ను ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయ బృందం వారికి అభినందనలు తెలియజేశారు




## గజ్వేల్ ప్రజ్ఞాపూర్ 6వ వార్డులో ముమ్మరంగా కాంగ్రెస్ ప్రచారం



**–వార్డ్ అభివృద్ధి లక్ష్యం – కౌన్సిలర్ అభ్యర్థి గాడిపల్లి నవ్యశ్రీ..**

**గజ్వేల్ జనవరి 30 మన వార్త ప్రతినిధి** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా 6వ వార్డులో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థి గాడిపల్లి నవ్యశ్రీ ఇంటింటి ప్రచారంలో దూసుకుపోతున్నారు. వార్డులోని ప్రతి గడపకూ వెళ్తూ, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ, కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాల్సిందిగా అభ్యర్థించారు. ఈ సందర్భంగా గాడిపల్లి నవ్యశ్రీ మాట్లాడుతూ తనపై నమ్మకంతో 6వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం కల్పించిన సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, మరియు గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని, ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమని అన్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి సారధ్యంలో, వారి సూచనలతో ముందుకు వెళ్తామని తెలిపారు. 6వ వార్డు ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, వార్డును అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో చేతి గుర్తు పై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని నవ్యశ్రీ కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాడిపల్లి శ్రీనివాస్, వార్డు ఇంచార్జ్ సుఖేందర్ రెడ్డి, దాచారం సర్పంచ్ చెన్నారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు...



**రామాయంపేట జనవరి 30 ( మన వార్త ప్రతినిధి )** మున్సిపల్ ఎన్నికల కోడ్ ఉన్నందున 50 వేల కంటే ఎక్కువ రవాణా చేయకూడదని మెదక్ జిల్లాలో 87 వేల మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారని మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా రామయంపేట మున్సిపల్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల ప్రక్రియను ఆయన సందర్శించారు, అనంతరం రామాయణపేట పట్టణంలో సిద్దిపేట చౌరస్తాలో ఏర్పాటుచేసిన పోలీస్ చెక్ పోస్ట్ ను ఆయన పరిశీలించి స్థానిక పోలీసులు నిర్వహిస్తున్న వాహనాల తనిఖీని ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలలో 150 వార్డులు ఉన్నాయని 87 వేల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని ఆయన అన్నారు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూర్తి బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రజలు తమ ఓటు హక్కును స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని ఎక్కడైనా గొడవలు సృష్టిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు, అనవసరంగా గొడవలు సృష్టిస్తే వారిపై నానుబైలబుల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా ప్రజలు సహకరించాలని ఆయన అన్నారు, ఈ కార్యక్రమంలో రామాయంపేట సిఐ వెంకటరాజా గౌడ్, రామాయంపేట ఎస్సై బాలరాజు, నిజాంపేట ఎస్సై రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కోసం క్యూలో ఉన్న మహిళా రైతులు...



**చిన్న శంకరంపేట జనవరి 30 ( మన వార్త ప్రతినిధి)** చిన్న శంకరంపేట మండలంలోని మడూర్ గవలపల్లి లో యూరియా కోసం ఉదయం నుండి రైతులు దుకాణాల ముందు బారులు తీరారు, వరి నాట్లు వేసి యూరియా కోసం ఇబ్బందులు పడుతున్నామని ఓవైపు యూరియా కొరత లేదంటూ అధికారులు సూచిస్తున్న ఇక్కడ మాత్రం యూరియా కోసం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని రైతులు వాపోయారు, యూరియా సంచుల కోసం మహిళా రైతుల సైతం ఉదయం నుండే వరుసలు నిలబడి ఉన్నారు, నాట్లు వేయడం జరిగిందని యూరియా లేఖ వరి ఎర్రబడుతుందని ఉదయం ఇంటి వద్ద పనులను మానుకొని యూరియా కోసం రావడం జరిగిందని అధికారులు స్పందించి రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని మహిళా రైతులు ఆవేదన వ్యక్తం చేశారు, ఒక రైతుకు ఒక సంచి ఇవ్వడం జరుగుతుందని, మరికొన్ని చోట్ల ఒక రైతుకు రెండు సంచులు యూరియా ఇవ్వడం జరుగుతుందని, రైతులకు సరిపడా యూరియా అందించాలని రైతులు కోరారు, ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి లక్ష్మీ ప్రవీణ్ మాట్లాడుతూ మండలంలో మడూర్ శంకరంపేట దబలపల్లి మహాలక్ష్మి ఫెర్టిలైజర్ దుకాణాలకు 1560 సంచులు రావడం జరిగిందని రైతులు యూరియా కోసం ఆందోళన చెందవద్దని రైతులకు సరిపడా యూరియా అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

## 13వ వార్డు సమస్యల పరిష్కారానికి షేక్ ఆరిఫాను గెలిపించండి



**–తెలంగాణ ముస్లిం ఐక్య సంఘం నేతలు...**

**–13వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలాలు చేసిన.. ఐక్య సంఘం బలపరిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి షేక్ ఆరిఫా...**

**మధిర, జనవరి30( మన వార్త )** ప్రజా సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ముస్లిం ఐక్య సంఘం బలపరిచిన కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి షేక్ ఆరిఫాను భారీ మెజార్టీతో గెలిపించాలని ముస్లిం ఐక్య సంఘం రాష్ట్ర అధ్యక్షులు మౌలానా షేక్ ముజాహిద్,రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ హుస్సేన్ మున్సిపాలిటీ ప్రజలను కోరారు. శుక్రవారం 13 కౌన్సిలర్ అభ్యర్థిగా సయ్యద్ రషీద్ కుమార్తె షేక్ ఆసిఫా నామినేషన్ దాఖలాల్ చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ముస్లిం ఐక్య సంఘం నేతలు ముజాహిద్, షేక్ హుస్సేన్ మాట్లాడారు. 13వ వార్డు ప్రజలు షేక్ ఆరిఫాని ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. ఆరిఫాకు ప్రజా సమస్యలపై అవగాహన ఉందని తనని గెలిపిస్తే మౌలిక వసతుల కల్పన,పారిశుధ్యం, తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు.

## గడ్కోలు గ్రామంలో పాఠశాలకు 20,000 విరాళం ఇచ్చిన వేలమ భాస్కర్ రెడ్డి




**నిజామాబాద్ జిల్లా సిరికొండ ( మన వార్త) జనవరి 30** సిరికొండ మండలంలోని గడ్కోల్ గ్రామ ప్రాథమిక పాఠశాలకు డిసిసి ప్రధాన కార్యదర్శి వెలమ భాస్కర్ రెడ్డి గారు మైక్ సెట్ (సౌండ్ బాక్స్) కొనుగోలుకు అవసరమైన 20,000లను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అందరూ సహకరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడమే తమ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ యూత్ ప్రెసిడెంట్ తుంపల్లీ మహేందర్,గడ్కోల్ గ్రామ సర్పంచ్ లత శంకర్, కొండాపూర్ సర్పంచ్ శ్రీధర్, గోప్య తండా సర్పంచ్ సంతోష్, సర్పంచ్ శోభా జీవన్, ఉప సర్పంచ్ సంపత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు సంతోష్ నాయక్, మాజీ ఎంపీటీసీ గొల్ల లింబన్న, మామిడి రాములు, ముషీర్ నగర్ మాజీ ఎంపీటీసీ నౌసీలాల్,నిరాజ్,మోతె నవీన్, బసంత్ కొచర్ గంగారెడ్డి, రమేష్ రెడ్డి,గొల్ల శ్రీనివాస్ యాదవ్, జుఎఫ సభ్యులు మల్కి సంజీవ్, విజయ్, సంతోష్ ,యువ నాయకుడు జయరాం, అలాగే పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విరాళం అందించిన వెలమ భాస్కర్ రెడ్డి గారికి గ్రామ ప్రజలు, పాఠశాల సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. ఈ సహకారం విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని వారు అభిప్రాయపడ్డారు.

## రామాయంపేట మున్సిపాలిటీలో కాంగ్రెస్ కు బిగ్ షాక్...



**రామాయంపేట, జనవరి 30 (మన వార్త ప్రతినిధి)** మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ మెదక్ నియోజకవర్గంలోని రామాయంపేటలో కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చౌదరి సుప్రభాత్ రావు ఆ పార్టీకి గుడ్ బై చెప్పి, బీఆర్ఎస్ లో చేరారు.కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను, బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.కేసీఆర్ హయాంలో పట్టణ ప్రగతి తో పట్టణాలు, మున్సిపాలిటీలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని హరీష్ రావు అన్నారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీల పేరిట రేవంత్ రెడ్డి అన్ని వర్గాలను మోసం చేశారు ఉన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలు గమనిస్తున్నారని, ఉమ్మడి మెదక్ జిల్లాలో జరగబోయే అన్ని మున్సిపాలిటీ ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయబోయేది, విజయ ఢంకా మోగించేది బీఆర్ఎస్ పార్టీనే అని హరీష్ రావు ధీమా వ్యక్తం చేశారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ కు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను, వైఫల్యాలను గడప గడపకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సుప్రభాత్ రావు రాకతో రామాయంపేటలో బీఆర్ఎస్ పార్టీ తిరుగులేని శక్తిగా మారిందని, కార్యకర్తలంతా ఐకమత్యంతో పనిచేసి మున్సిపల్ ఎన్నికల్లో ఘన విజయం సాధించి కేసీఆర్ గారికి కానుకగా ఇవ్వాలని కోరారు. పార్టీని నమ్ముకుని వచ్చిన ప్రతి కార్యకర్తకు, నాయకుడికి బీఆర్ఎస్ కుటుంబం అండగా ఉంటుందని, ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదని హరీష్ రావు భరోసా ఇచ్చారు.సుప్రభాత్ రావు మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీలో కార్యకర్తలకు, నాయకులకు సరైన గుర్తింపు లేదని, పార్టీ కోసం కృషి చేసిన వారిని వదిలి కొత్తగా పార్టీలోకి వచ్చిన వారిని గుర్తించడం కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని, కేవలం గ్రూపు రాజకీయాలకే పరిమితమైందని సుప్రభాత్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. మెదక్ జిల్లా అభివృద్ధి కేవలం బీఆర్ఎస్ తోనే సాధ్యమని, కేసీఆర్,హరీష్ రావు నాయకత్వంపై నమ్మకంతోనే తాను బీఆర్ఎస్ లో చేరానని స్పష్టం చేశారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో రామాయంపేటలో గులాబీ జెండా ఎగురవేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రామాయంపేట మున్సిపల్ మాజీ చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్, మాజీ జుఖుఎం చైర్మన్ బాధే చంద్రం, పార్టీ నాయకులు పుట్టి యాదిగిరి,
శ్రీకాంత్ సాగర్ ,ఎస్ కే హైమద్, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ఏఎస్ఐ నారాయణ మృతదేహానికి నివాళులు అర్పించిన డీఎస్పీ

**జహీరాబాద్, జనవరి 30 (మన వార్త):** ఇంటిలిజెన్స్ పోలీస్ విభాగం ఏ ఎస్ఐ సిహెచ్ నారాయణ మృతదేహానికి జహీరాబాద్ డీఎస్పీ సైదా నాయక్, సీఐ శివలింగం, పట్టణ ఎస్ఐ వినయ్ కుమార్ లు ఘనంగా నివాళులు అర్పించారు. న్యాల్కల్ మండలం చీకుర్తి గ్రామ వాస్తవ్యులు ఏ ఎస్ఐ నారాయణ జహీరాబాద్ నివాసంలో గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ, సీఐ, ఎస్ఐ లతో కలిసి నారాయణ మృతదేహాన్ని సందర్శించి, ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. పోలీస్ శాఖలో నారాయణ అంకిత భావంతో విధులు నిర్వహించారని, ఇలాంటి అధికారిని అకస్మాత్తుగా కోల్పోవడం పోలీస్ శాఖకు బాధాకరం అని అన్నారు.

## వీధి కుక్కల దాడి బాలుడికి తీవ్రగాయాలు ఆసుపత్రికి తరలింపు...



**నార్సింగి జనవరి 30 ( మన వార్త ప్రతినిధి)** నార్సింగి మండలం శంకాపూర్ తండాలో పిచ్చి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. శుక్రవారం ఉదయం ఓ బాలుడిపై దాడి చేశాయి. ఈఘటనలో సంకాపూర్ తండా చెందిన అమన్దీప్ సింగ్(3) అనే బాలుడికి తీవ్ర గాయాలు కావడంతో బాలుడిని వెంటనే రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ సందర్భంగా శంంగాపూర్ తండా గ్రామస్తులు మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని, పిచ్చికుక్కల నివారణకు కృషి చేయాలని కోరుతున్నారు.

## శిథిలావస్థలో శ్రీరంగాపూర్ మండల గ్రంథాలయం



**శ్రీరంగాపురం జనవరి 30 : (మనవార్త ప్రతినిధి)** శ్రీరంగాపురం మండల కేంద్రంలో గ్రంథాలయం శిథిలావస్థలో ఉందని కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ గోవిందు తెలిపారు. శుక్రవారం కాంగ్రెస్ కార్యకర్తలు మండల గ్రంథాలయం పరిసరాలు పరిశీలించి,గ్రంథాలయం పూర్తిగా శిథిలావస్థలో ఉందని,తగిన మౌలిక సదుపాయాలను కల్పించి గ్రంథాలయ భవనాన్ని పునర్నిర్మాణం చేయాలని,మండల కేంద్రంలో గ్రంథాలయ ఆవశ్యకత ఎంత ఉందని,యువకులు నిరుద్యోగులు గ్రంథాలయాన్ని ఎక్కువగా వినియోగించుకుంటున్నారని అందుకు తగిన విధంగా గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు రామచంద్రయ్య,రాజు,రమేష్,ఆంజనేయులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## నామినేషన్ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలి...



**-జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ...**

**రామయంపేట జనవరి 30( మన వార్త ప్రతినిధి )** నామినేషన్ దరఖాస్తుల్లో తప్పులు లేకుండా నింపాలని, నామినేషన్ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని, నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరగాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులకు సూచించారు.రామాయంపేట మున్సిపాలిటీ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ ప్రక్రియను శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో సాధారణ పరిశీలకులు రవి కిరణ్ తో కలిసి పరిశీలించారు.నామినేషన్ పత్రాలను, వివిధ రిజిస్టర్లను పరిశీలించారు. ఎన్నికల సిబ్బందికి పలు సలహాలు సూచనలు అందించారు.ఎన్ని వార్డులు ఉన్నాయి? ఎన్ని నామినేషన్ లు వచ్చాయని ? సాధారణ పరిశీలకులు ఎన్నికల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ.. తప్పులు లేకుండా నామినేషన్ ప్రక్రియ జరగాలని, నామినేషన్ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి తీసుకోవాలని, మున్సిపల్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ఎన్నికల సంఘం నియమానిబంధనను తూచా తప్పకుండా అనుసరించి నామినేషన్ ప్రక్రియ కొనసాగాలన్నారు. నామినేషన్ పత్రాలతో పాటు జతచేసే జిరాక్స్ లను సరిచూసి తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్డీవో మైపాల్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ దేవేందర్, నోడల్ అధికారి తహశీల్దార్ రజని కుమారి, తదితరులు ఉన్నారు.

## జగదాంబ తండా గ్రామంలో దోమల నివారణ

**నిజామాబాద్ జిల్లా సిరికొండ( మన వార్త) జనవరి 30** సిరికొండ మండలం జగదాంబ తండా గ్రామంలో దోమల నివారణకు దోమల మందు స్ప్రే చేపియడం జరిగింది, ప్రజలు దోమల తీవ్రత ఎక్కువ ఉండటంవల్ల అనారోగ్య భారీ పడకుండా ఉండడానికి గ్రామ సర్పంచ్ మాలవత్ సుగుణ గారు ఉప సర్పంచ్ గణేష్ నాయక్ గారు వార్డు సభ్యులు జిల్లా కాంగ్రెస్ యువజన నాయకులు రవి నాయక్ కలిసి దోమల నివారణకి తండాలలో మిషన్ తో స్ప్రే చేపియడం జరిగింది.

## మున్సిపల్ ఎన్నికలలో 8వ వార్డు నుండి నామినేషన్ వేసిన శివకుమార్




**– వార్డు అభివృద్ధే నా లక్ష్యం' శివకుమార్...**

**గజ్వేల్ జనవరి 30 మన వార్త ప్రతినిధి** గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ 8వ వార్డులో బీఆర్ఎస్ అభ్యర్థి కౌన్సిలర్ గా గుగులోత్ శివకుమార్ నామినేషన్ కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించి ప్రారంభమైన ఈ కార్యక్రమం, పార్టీ జెండాలతో నిర్వహించిన భారీ ర్యాలీతో 8వ వార్డంతా గులాబీ వర్ణంలో మెరిసింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచులు, వార్డు ఇన్చార్జిలు, గ్రామ ప్రజలు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని శివకుమార్‌కు తమ మద్దతు ప్రకటించారు. ప్రజలతో మమేకమై, నమస్కారాలతో పలకరించిన ఆయన తీరు జనాల్లో విశ్వాసాన్ని మరింత బలపరిచింది.నామినేషన్ అనంతరం వార్డు ప్రజలను ఉద్దేశించి శివకుమార్ మాట్లాడుతూ... తాను అభ్యర్థిగా మాత్రమే కాకుండా ప్రజల మధ్య నుంచే ఎదిగిన వ్యక్తిగా వారి ముందుకు వచ్చానని తెలిపారు. వార్డులోని ప్రతి వీధి, ప్రతి ఇంటి సమస్య తనకు సుపరిచితమని, ప్రజల కష్టాలు, ఆశయాలే తన రాజకీయ ప్రయాణానికి మార్గదర్శకమని పేర్కొన్నారు.వార్డు అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేసిన ఆయన, ప్రజలకు రావాల్సిన పరిహారాలు, మౌలిక సదుపాయాలు అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశయాలను 8వ వార్డులో అమలు చేయడమే తన బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి కారు గుర్తుకు ఓటు వేసి తనను కౌన్సిలర్‌గా గెలిపించాలని కోరారు. ప్రజల ఆశీర్వాదాన్ని ఎప్పటికీ వృథా కానివ్వనని, ప్రజల గెలుపే తన గెలుపని స్పష్టం చేశారు.

## వనదేవతలకు మొక్కులు తీర్చుకున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

**శంకరపట్నం:జనవరి30(మనవార్త ప్రతినిధి)** శంకరపట్నం మండలం కేశవపట్నం సమ్మక్క– సారలమ్మ జాతరలో మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శుక్రవారం పాల్గొని వన దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు జాతర కమిటీ చైర్మన్ గుర్రం స్వామి,కమిటీ సభ్యులు స్వాగతం పలికారు.ఎమ్మెల్యే వెంట పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోపగోని బస్వయ్య గౌడ్,హుజురాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపల్లి,పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు మొలంగూరి సదానందం,పార్టీ నాయకులు దుర్గపు తిరుపతి,గొట్టె మధు,గాజుల మహేష్, రాయిని రమేష్,జనగాం రాజయ్య,కీసర సంపత్,ఆడెపు అజయ్,ఇసామొద్దీన్,వెంగళ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన నామినేషన్ల ప్రక్రియ.. 118 నామినేషన్ల స్వీకరణ...




**రామయంపేట జనవరి 30 ( మన వార్త ప్రతినిధి)** రామయంపేట మున్సిపాలిటీలో నేడు చివరి రోజు నామినేషన్ల స్వీకరణ పూర్తయింది ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు వేశారు, వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను అధికారులకు అందజేశారు, రామాయంపేట మున్సిపాలిటీలో మొత్తం 69 మంది నామినేషన్ వేయగా మొత్తం 12 వార్డులలో 118 నామినేషన్లు రావడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ దేవేందర్ తెలిపారు, ఇండియన్ కాంగ్రెస్ 39, బిజెపి 27, బి ఆర్ ఎస్ 31, టీజీఎస్ ఈసీ ఒక్క నామినేషన్ స్వతంత్ర అభ్యర్థులు 20 నామినేషన్ పత్రాలు వచ్చినట్టు, ఫిబ్రవరి 11వ తేదీ ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా ప్రజలు సహకరించాలని ఆయన కోరారు, నేటితో నామినేషన్ల ప్రక్రియ పూర్తి కావడం జరిగిందని మరో రెండు రోజులు స్క్రూట్ ని నిర్వహించడం జరుగుతుందని అనంతరం గుర్తులు కేటాయించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

## సమ్మక్క సారలమ్మను దర్శించుకున్న



**-ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ...**

**బెజ్జంకి,జనవరి 30(మన వార్త ప్రతినిధి )** సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం లోని తోటపల్లి గ్రామ సమ్మక్క – సారాలమ్మల జాతర ఆలయ చేర్మెన్, కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ శుక్రవారం వనదేవతలను దర్శించుకొనికి విచ్చేసిన ఎమ్మెల్యే కి ఆలయ కమిటీ, గ్రామస్తులు ఘనంగా ఆహ్వానించి,ఆలయ పూజారిచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే కి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ సమ్మక్క సారలమ్మ వనదేవతల ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆ యొక్క వన దేవతలను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో జాతర కమిటీ చైర్మన్ బోయినపల్లి నర్సింగ రావు,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గు దామోదర్, ఇల్లంతకుంట మాజీ ఎంపీపీ ఉట్కూరి రమణ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## రేగురి లక్ష్మణ్, కృష్ణప్రసాద్ ని సన్మానించిన హరిహర చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు...




**వేములవాడ జనవరి 30 (మన వార్త)** వేములవాడ: రేగూరి లక్ష్మణ్ కృష్ణ ప్రసాద్ ని హరిహర చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు వారిని శాలువాతో సన్మానించి శ్రీ రాజరాజేశ్వర స్వామి ప్రసాదం నూ అందజేశారు ఈ సందర్భంగా రేగూరి లక్ష్మణ్, కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ హరిహర చారిటబుల్ ట్రస్ట్ కూ ఎల్ల వేళల మా సహాయ సహకారాలు ఉంటాయని ఈ సందర్భంగా వారు తెలియజేశారు హరిహర చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ సామాజిక సేవ చేయాలని ఉన్నవారు మా ట్రస్టులో చేరి వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించవచ్చని ఈ సందర్భంగా వారు తెలియజేశారు

## వేములవాడలో ప్రశాంతంగా కొనసాగుతున్న బార్ కౌన్సిల్ ఎన్నికలు





**-ఓటు హక్కు వినియోగించుకున్న బార్ అధ్యక్షుడు గుడిసె సదానందం...**

**వేములవాడ జనవరి 30 (మన వార్త)** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నేడు జరుగుతున్న బార్ కౌన్సిల్ ఎన్నికల్లో భాగంగా వేములవాడ కోర్టులో కౌన్సిల్ ఎన్నికలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఎన్నికలకు సంబంధించిన ఓటింగ్ బాక్స్ కు జూనియర్ సివిల్ జడ్జి జ్యోతిర్మయి సీల్ వేశారు. అనంతరం ఉదయం 10:30 గంటలకు ఎన్నికలు మొదలయ్యాయి. సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికలు కొనసాగుతాయి. ఎన్నికల అధికారిగా సీనియర్ న్యాయవాది పొత్తూరు అనిల్ కుమార్ వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 35,316 మంది ఓటు హక్కు కలిగిన న్యాయవాదులు ఉండగా, కౌన్సిల్ అభ్యర్థులుగా 148 మంది పురుషులు, 55 మంది మహిళలు బరిలో ఉన్నారు. ఈ ఎన్నికల్లో వేములవాడ కోర్టులో 121 మంది న్యాయవాదులు ఓటు హక్కు కలిగి ఉన్నారు. ఎంతమంది న్యాయవాదులు ఓటు హక్కు వినియోగించుకున్నారో సాయంత్రం వెల్లడయ్యే అవకాశం ఉంది.ఎన్నికల అబ్జర్వర్ గా సీనియర్ సివిల్ కోర్టు సూపరింటెంట్ అంజయ్య, సహాయ ఎన్నికల అధికారిగా న్యాయవాది నక్క దివాకర్ వ్యవహరిస్తున్నారు.

## ముందస్తు అడ్మిషన్స్ చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



**రాజన్న సిరిసిల్ల జనవరి 30 (మన వార్త)** రాజన్న జిల్లా వ్యాప్తంగా నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్స్ చేస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని భీమ్ ఆర్మీ ఆధ్వర్యంలో జిల్లా విద్యాధికారి గారికి వినతి పత్రం అందజేయడం జరిగింది ఈ సందర్భంగా భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు దొబ్బల ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ప్రైవేట్ పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా పేద విద్యార్థులను తల్లిదండ్రులను మోసం చేస్తూ అడ్మిషన్లు చేస్తున్నారని ముందుగా అడ్మిషన్ పొందిన విద్యార్థులకు పాఠశాల మరియు వాహన ఫీజులో రాయితీ కల్పిస్తామని చెప్పుతూ విద్యా సంవత్సరం పూర్తి కాకముందే అడ్మిషన్లు చేస్తున్నారని అన్నారు అలాంటి పాఠశాలలను గుర్తించి వెంటనే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు... ప్రయివేట్ పాఠశాలు కనీస మౌలిక వసతులు కల్పించకుండా ధనార్జనమే ధ్యేయంగా పని చేస్తున్నాయని అన్నారు పిజులు కోసం విద్యార్థులను చితక బాధిన సంఘటనలు జరుగుతున్న విద్య అధికారుల నిర్లక్ష్యంగా ప్రయివేట్ పాఠశాలలు ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తున్నాయి అన్నారు...ఇప్పటికి అయిన జిల్లా విద్య అధికారులు పాఠశాలను తానికి ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తున్న వాటిని గుర్తంపులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామని అన్నారు

## సొంత గూటికి గూడూరి మధు దంపతులు..



**వేములవాడ జనవరి 30 (మన వార్త)**వేములవాడ స్థానిక రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకుడు గూడూరి మధు, మాజీ కౌన్సిలర్ గూడూరు లక్ష్మిలు తిరిగి బిఆర్ఎస్ పార్టీలో చేరారు. నియోజకవర్గ ఇంచార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు సమక్షంలో వారు అధికారికంగా పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా చల్మెడ మాట్లాడుతూ.. మధు కుటుంబం మొదటి నుంచి పార్టీతో అనుబంధం కలిగి ఉందని, సొంత గూటికి వచ్చిన వారిని సాదరంగా ఆహ్వానిస్తున్నామని తెలిపారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో 25వ వార్డు నుంచి బిఆర్ఎస్ అభ్యర్థిగా గూడూరి మధు పోటీలో ఉంటారని ఆయన ప్రకటించారు. వార్డు అభివృద్ధి లక్ష్యంగా, ప్రజలకు మరింత చేరువయ్యేందుకే తాము ఈ నిర్ణయం తీసుకున్నట్లు మధు దంపతులు పేర్కొన్నారు. ఈ చేరికతో మున్సిపల్ ఎన్నికల వేళ రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది.

## జవీ కప్ కబడ్డీ వాలీబాల్ పోటీలు ప్రారంభోత్సవం




**రాజన్న సిరిసిల్ల జిల్లా,ఎల్లారెడ్డి పేట మండల, మన వార్త ప్రతినిధి జనవరి:30** ఎల్లారెడ్డి పేట పట్టణకేంద్రంలోనీ పల్లె ప్రకృతి వనం లోని క్రీడా మైదానంలో సీఎం కప్ కబడ్డీ, వాలీబాల్, పోటీలను రాచర్ల బొప్పాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ షేక్ సగారా బేగం, స్థానిక ప్రజా ప్రతినిధులు నాయకులు పాల్గొని క్రీడలను ప్రారంభించారు, కబడ్డీ వాలీబాల్ లాంటి ఆటలను ఆడితే పిల్లల భవిష్యత్తు బాగుంటుందని మరియు క్రీడల వల్ల పిల్లలకు ఉద్యోగాలు వచ్చే అవకాశాలు ఉంటాయని అదేవిధంగా ఆరోగ్యం బాగుంటుందని నిత్యము క్రీడల్లో పాల్గొని చదువుల్లో ముందుండి ఫోన్లు చూడకుండా పిల్లలు ఉంటే భవిష్యత్తులో ఎంతో ఎత్తుకు ఎదగచ్చని ఎంపీడీవో సత్తయ్య ఇలా అన్నారు ఈ కార్యక్రమంలో,మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు దొమ్మాటి నరసయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామ్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మెండే శ్రీనివాస్, వర్ద ప్రవీణ్, నాయకులు చిన్ని బాబు,గిరిధర్ రెడ్డి,షకీల్, తదితరులు పాల్గొన్నారు,

## మహా శివరాత్రి జాతర పోస్టర్లను ఆవిష్కరించిన ఇంచార్జి కలెక్టర్

**–ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ కు ఆహ్వాన పత్రిక అందించిన ఆలయ ఈఓ, అర్చకులు...**

**రాజన్న సిరిసిల్ల, జనవరి –30 (మన వార్త)**ఈ నెల 14వ తేదీ నుంచి నిర్వహించనున్న మహా శివరాత్రి జాతర పోస్టర్లను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆవిష్కరించారు. ఈ నెల 14వ తేదీ నుంచి



వేములవాడలో నిర్వహించనున్న మహా శివరాత్రి జాతర పోస్టర్లను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆలయ ఈఓ రమాదేవి, అధికారులు, అర్చకులతో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం ఆలయ ఈఓ, అర్చకులు ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ కు జాతర ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఈ నెల 14వ తేదీ నుంచి 16 వ తేదీ వరకు వేములవాడలో మహా శివరాత్రి జాతర ఉత్సవాలు నిర్వహించనున్నామని వెల్లడించారు. 15 వ తేదీన మహా శివరాత్రి జాతర నిర్వహించనున్నామని తెలిపారు. జాతర సందర్భంగా భక్తులకు కల్పిస్తున్న ఏర్పాట్లపై అధికారులను ఇంచార్జి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రణాళిక ప్రకారం అన్ని వసతులు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ ఈఈ రాజేష్, డీఈ రఘునందన్, అర్చకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్ ఎస్ టీ చెక్ పోస్ట్ తనిఖీ చేసిన సాధారణ, వ్యయ పరిశీలకులు



**రాజన్న సిరిసిల్ల, జనవరి – 30 (మన వార్త)**మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో రగుడు వద్ద ఏర్పాటు చేసిన ఎస్ ఎస్ టీ చెక్ పోస్ట్ ను జిల్లా మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు, వ్యయ పరిశీలకులు డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, రాజ్ కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్ పోస్ట్ లో ఉన్న సిబ్బంది వద్ద ఉన్న వివిధ రిజిస్టర్లు పరిశీలించారు. వారికి పలు సూచనలు చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ. 20 లక్షల డబ్బులు సీజ్ చేశామని, తదుపరి విచారణ కోసం పోలీసులకు అప్పగించామని అధికారులు తెలిపారు. తనిఖీలో నోడల్ అధికారులు నవీన్ కుమార్, భారతి తదితరులు ఉన్నారు.

## నామినేషన్ కేంద్రాల్లో అదనపు కలెక్టర్ పరిశీలన –ఎస్ఎస్ టీ చెక్ పోస్ట్ తనిఖీ



**సిరిసిల్ల/వేములవాడ, జనవరి – 30** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో హెల్ప్ డెస్క్ లు, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను సందర్శించి, అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడు వద్ద ఉన్న ఎస్.ఎస్.టీ (స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్) చెక్ పోస్టును అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. రిజిస్టర్లు పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు పరిశీలనలో అదనపు ఎస్పీ చంద్రయ్య, వేములవాడ ఆర్డీఓ రాధాభాయ్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, సంపత్ కుమార్, నోడల్ అధికారులు నవీన్ కుమార్, శ్రీనివాసాచారి, తహసీల్దార్లు జయంత్ కుమార్, మహేష్ కుమార్, టీపీఓ అన్సార్, మీర్జా ఫసహత్ అలీ బేగ్ తదితరులు ఉన్నారు.

## అప్రమత్తంగా ఉంటూ వాహనాలను తనిఖీ చేయాలి




**వేములవాడ, జనవరి–30 (మన వార్త)**మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన ఎస్.ఎస్.టీ (స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్) చెక్ పోస్టుల వద్ద విధులు నిర్వర్తించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని కరీంనగర్ రోడ్డులో ఉన్న సంకేపల్లి, జగిత్యాల రోడ్డులో ఉన్న శాత్రాజపల్లి, కోరుట్ల రోడ్డులో కోనాయపల్లి వద్ద ఏర్పాటు చేసిన ఎస్.ఎస్.టీ చెక్ పోస్టులను ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో నగదు, మద్యం, తరలించకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. చెక్ పోస్టులో నిర్వహిస్తున్న రిజిస్టర్లను పరిశీలించి, ఇప్పటివరకు తనిఖీ చేసిన వాహనాల వివరాలు, స్వాధీనం చేసుకున్న వస్తువులు ఉన్నాయా లేదా అనే అంశాలపై ఆరా తీశారు. వాహనాల తనిఖీ ప్రక్రియ కట్టుదిట్టంగా చేయాలని, ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా విధులు నిర్వర్తించాలని సూచించారు. అలాగే ప్రతి తనిఖీ వివరాలను స్పష్టంగా రిజిస్టర్లలో నమోదు చేయాలని, వీడియో రికార్డింగ్ చేయాలని ఆదేశించారు. ఎన్నికలు పూర్తయ్యేవరకు చెక్ పోస్టుల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా అమలు చేయాలని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ స్పష్టం చేశారు. తనిఖీలో తహసీల్దార్ జయంత్ కుమార్, రెవెన్యూ, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు

## వాసవి క్లబ్. వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతి వేడుకలు..



**ఇల్లందకుంట,జనవరి 30, (మనవార్త ప్రతినిధి):**వాసవి క్లబ్ మరియు వాసవి వనిత క్లబ్. ఇల్లందకుంట వారు మహాత్మగాంధీ వర్ధంతి రాచపల్లి గ్రామంలో మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా పూలమాలలు వేసి స్వీట్స్ పంపిణీ చేశారు. వాసవి క్లబ్ సభ్యులు, గ్రామ సర్పంచి, వాసవి క్లబ్ సభ్యులు చిదురాల నాగేష్ గుప్తా, గర్రెపల్లి వెంకటరాజ్యం, గోలి శివకుమార్, నూక గౌరీ శంకర్,వాసవి క్లబ్ ఇల్లందకుంట మండలం ప్రెసిడెంట్ కండెం వేణు, సెక్రెటరీ చిదురాల వెంకటేశ్వర్లు, వాసవి వనిత క్లబ్ ప్రెసిడెంట్ నూక సరిత, ట్రెజరర్ గోలి శకుంతల తదితరులు పాల్గొన్నారు.

## జమ్మికుంట 24వ వార్డులో మార్పు రాజకీయాలకు శ్రీకారం..

**–కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన అరికిల్ల స్రవంతి భానుచందర్...**

**–ఆదరించండి వార్డు అభివృద్ధికి పాటుపడుతా...**

**జమ్మికుంట, జనవరి 30( మన వార్త ప్రతినిధి):**జమ్మికుంట పట్టణంలోని పద్మశాలి కాలనీ 24వ వార్డులో మున్సిపల్ ఎన్నికలు




రోజు రోజుకీ రాజకీయంగా వేడెక్కుతున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా అరికిల్ల స్రవంతి భానుచందర్ శుక్రవారం నామినేషన్ పత్రాలు సమర్పించడంతో ఎన్నికల సమీకరణలు మారుతున్నాయని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. నామినేషన్ అనంతరం స్రవంతి మాట్లాడుతూడఇన్నాళ్లుగా పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి దూరమైన 24వ వార్డులో ఈసారి ప్రజలు మార్పు కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. ఎన్నికల సమయం వచ్చినప్పుడు మాత్రమే కనిపించే నాయకత్వానికి ప్రజలు విసిగిపోయారని, వార్డు ప్రజలకు అవసరమైనది మాటలు కాదు పనిచేసే ప్రతినిధి అని ఆమె పరోక్షంగా ప్రతిపక్షాలపై విమర్శలు గుప్పించారు. కాలనీలోని తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, పారిశుద్ధ్యం వంటి సమస్యలు సంవత్సరాలుగా అలాగే ఉండిపోయాయని అన్నారు. ప్రజల మధ్యే ఉండి సమస్యల పరిష్కారానికి పోరాడే నాయకత్వమే కాంగ్రెస్ పార్టీదని ఆమె చెప్పారు. ప్రజల ఓటు హక్కును నిర్లక్ష్యం చేసిన వారికే ఈ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పబోతున్నారని, అభివృద్ధి కోసం నిజంగా కృషి చేసే వారికే మద్దతు లభిస్తుందని స్రవంతి ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో వ్యక్తిగత లాభాల కోసం రాజకీయాలు చేసే శక్తులకు కాకుండా, ప్రజా సంక్షేమాన్ని ముందుకు నడిపించే 'చేతి గుర్తు'కు ఓటు వేయాలని ఆమె పిలుపునిచ్చారు. భారీ మెజారిటీతో గెలిపిస్తే 24వ వార్డును అభివృద్ధిలో ముందుండే వార్డుగా మార్చుతానని హామీ ఇచ్చారు. నామినేషన్ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై మద్దతు తెలిపారు. 24వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి బరిలోకి దిగడంతో ప్రతిపక్షాల్లో చర్చ మొదలైందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## పెద్దంపల్లి గ్రామంలో పౌర హక్కుల దినోత్సవశీ..



**జమ్మికుంట,జనవరి 30 ( మన వార్త ప్రతినిధి):**మండల పరిధిలోని పెద్దపల్లి గ్రామంలో పౌర హక్కుల దినోత్సవాన్ని గ్రామ సర్పంచ్ ఎగిత పద్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఎగితపద్మ కుమార్ మాట్లాడుతూ గ్రామంలో ఎటువంటి వివక్షత లేకుండా అందరూ సమానంగా జీవించాలని వయస్సుతో తేడా లేకుండా అందరూ చదువుకోవాలని గ్రామంలో నిరక్షరాస్యత అనేదే లేకుండా చేయాలని తెలిపారు. గ్రామంలో రెండు వర్గాల పద్ధతి పాటించరాదని పాటించినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని తెలిపారు, ప్రతి వ్యక్తి దేవాలయానికి వెళ్లే హక్కు ఉన్నదని స్వేచ్ఛ సమానత్వం సౌభ్రతత్వంగా జీవించాలని ఆర్టికల్ 25 లో భారత దేశంలోని ప్రతి వ్యక్తి ఏ మతాన్నైనా స్వీకరించే హక్కు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భారత రాజ్యాంగంలో తెలిపారని అన్నారు. బాల్యవివాహాలు ,బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, జోగిని వ్యవస్థ నిర్మూలించాలని తెలిపారు. అనంతరం గాంధీ వర్ధంతి సందర్భంగా జిల్లాను కుష్టు వ్యాధి రహిత జిల్లాగా మార్చుటలో పెద్దంపల్లి గ్రామ ప్రజల సమక్షంలో స్పర్ష్ లేప్రసి అవేర్నెస్ క్యాంపెనింగ్ సందర్భంగా ప్రజలందరి చేత తమ వంతు ప్రయత్నం చేస్తామని తమ గ్రామంలో ఆ వ్యాధి లక్షణాలు ఉన్న వారి పట్ల వివక్ష చూపించకుండా వారికి వ్యాధి నిర్మూలనకై ప్రభుత్వం చేస్తున్న శిక్షణ కార్యక్రమాల గురించి మోటివేట్ చేసి వ్యాధి నిర్మూలనకై కృషి చేస్తామని గ్రామ ప్రజల ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎగిత పద్మ కుమార్, గ్రామ కార్యదర్శి ప్రదీప్, ఏఎన్ఎం శ్యామల, ఆశ వర్కర్లు సుమలత స్వరూప, అంగన్వాడి టీచర్ రమాదేవి, జి పి ఓ పాక సతీష్, వార్డు సభ్యులు, నవీన్, హరీష్ ,రాజ్ కిరణ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## జమ్మికుంట వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో గాంధీకి ఘన నివాళి..




**జమ్మికుంట, జనవరి 30( మన వార్త ప్రతినిధి):**జమ్మికుంట పట్టణంలో మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని వాసవి వనితా క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జమ్మికుంట గాంధీ చౌరస్తాలోని జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి పాలాభిషేకం చేశారు. అనంతరం గాంధీ దేశానికి చేసిన సేవలను స్మరించుకుంటూ, ఆయన అహింసా మార్గం మరియు ఆశయాలను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఆచరించాలని క్లబ్ ప్రెసిడెంట్ ఐత శ్రీలత, సెక్రటరీ చొక్కారపు జ్యోతి, ట్రెజరర్ మద్ది సురేఖ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వాసవి వనితా క్లబ్ సభ్యులందరూ పాల్గొని మహాత్మాగాంధీకి ఘన నివాళులు అర్పించారు.

## తిరువీర్ 'భగవంతుడు' టీజర్ విడుదల..




**హైదరాబాద్** టాలీవుడ్ యువ నటుడు తిరువీర్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'భగవంతుడు' నుంచి టీజర్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు ప్రాంతం నేపథ్యంగా రూపొందుతున్న ఈ సినిమా పల్లెటూరి వాతావరణంలో సాగే పీరియడ్ డ్రామాగా ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా విడుదలైన టీజర్‌లో చూపించిన విజువల్స్, నేపథ్య సంగీతం, తిరువీర్ డైలాగ్ డెలివరీ సినిమాపై అంచనాలను భారీగా పెంచాయి. ఇంతకుముందు మసూద, ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో చిత్రాలతో నటుడిగా తనదైన గుర్తింపు తెచ్చుకున్న తిరువీర్ ఈ సినిమాలో పూర్తిగా భిన్నమైన, భావోద్వేగపూరిత పాత్రలో కనిపించనున్నాడు. గ్రామీణ జీవనశైలి, అక్కడి సంఘర్షణలు, భావోద్వేగాలను గట్టిగా ఆవిష్కరించినట్టు టీజర్ స్పష్టంగా చూపిస్తోంది. జీజీ విహారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని రవి పనస ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్‌పై రవి పనస నిర్మిస్తున్నారు. ఫరియా అబ్దుల్లా కథానాయికగా నటిస్తుండగా, రిషి నాగరాజు, కాలకేయ ప్రభాకర్, రవీంద్ర విజయ్, మురళీధర్ గౌడ్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ఒకేసారి విడుదల చేయడానికి మేకర్స్ సిద్ధమవుతున్నారు. టీజర్ విడుదలతో 'భగవంతుడు'పై సినీ ప్రియుల్లో ఆసక్తి మరింత పెరిగింది.

## రజినీ కమల్ మల్టీస్టారర్ మళ్లీ హాట్ టాపిక్..




**హైదరాబాద్** భారతీయ సినిమా స్థాయిని మరో మెట్టు పైకి తీసుకెళ్లిన భారీ చిత్రాల ట్రెండ్ కొనసాగుతూనే ఉంది. ఇదే క్రమంలో మల్టీస్టారర్ సినిమాలపై ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరుగుతోంది. ముఖ్యంగా అగ్ర కథానాయకులు కలిసి నటిస్తే ఆ ప్రాజెక్ట్ విడుదలకు ముందే విపరీతమైన హైప్ ఏర్పడుతోంది. అలాంటి అత్యంత క్రేజీ కాంబినేషన్‌గా సూపర్ స్టార్ రజినీకాంత్ మరియు యూనివర్సల్ స్టార్ కమల్ హాసన్ కలిసి నటించే సినిమా మరోసారి చర్చకు వచ్చింది. గతంలో ఈ ఇద్దరు లెజెండరీ నటులు కలిసి ఒక ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ చేయబోతున్నారన్న వార్తలు సంచలనం సృష్టించాయి. తాజాగా ఆ మల్టీస్టారర్ ప్రాజెక్ట్‌పై మళ్లీ ఊపు వచ్చిందని తమిళ సినీ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. ఈ భారీ చిత్రాన్ని జైలర్ సినిమాతో సంచలన విజయాన్ని అందుకున్న దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ టేకోవర్ చేసినట్లు గట్టి ప్రచారం జరుగుతోంది. ఈ వార్తలకు బలం చేకూర్చేలా, రజినీకాంత్ □ కమల్ హాసన్ కలయికలో రూపొందబోయే సినిమాకు సంబంధించి ఒక ప్రత్యేక విజువల్ లేదా అనౌన్స్‌మెంట్ కట్‌ను నెల్సన్ ఇప్పటికే సిద్ధం చేస్తున్నాడన్న టాక్ కూడా నడుస్తోంది. అయితే ఈ ప్రాజెక్ట్ వెంటనే సెట్స్‌పైకి వెళ్లే అవకాశం మాత్రం తక్కువేనని సమాచారం. ప్రస్తుతం నెల్సన్ జైలర్ రెండో భాగంతో పాటు ఇతర చిత్రాల పనుల్లో బిజీగా ఉండటంతో, అవి పూర్తైన తర్వాతే ఈ మల్టీస్టారర్‌పై దృష్టి పెట్టే ఛాన్స్ ఉందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. రజినీకాంత్, కమల్ హాసన్ ఇద్దరూ ఒకే ఫ్రేమ్‌లో కనిపిస్తే అది కేవలం సినిమా మాత్రమే కాదు, సినీ చరిత్రలో నిలిచిపోయే ఘట్టంగా మారుతుందన్న నమ్మకం అభిమానుల్లో ఉంది. అందుకే ఈ ప్రాజెక్ట్‌పై వస్తున్న ప్రతి చిన్న వార్త కూడా భారీ చర్చకు దారి తీస్తోంది. అయితే ఇప్పటివరకు ఇవన్నీ ఊహాగానాలే కావడంతో, అసలు నిజం ఏంటన్నది అధికారిక ప్రకటన వచ్చే వరకూ వేచి చూడాల్సిందే.

## మళ్లీ యాక్టివేట్ అయిన కోహ్లీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా




**హైదరాబాద్** టీమిండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా నిన్న రాత్రి నుంచి కనిపించకుండా పోవడం అభిమానుల్లో ఆందోళన కలిగించింది. ఖాతా తెరవగానే యూజర్ నాట్ ఫౌండ్ అనే సందేశం రావడంతో కోహ్లీ స్వయంగా తన ఖాతాను డిలీట్ చేశాడా అనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. సోషల్ మీడియాలో ఈ విషయం వేగంగా వైరల్ కావడంతో అభిమానులు కారణాలు ఏమిటని ఆరా తీశారు. ఈ క్రమంలో పలువురు అభిమానులు అనుష్క శర్మను ట్యాగ్ చేస్తూ కోహ్లీ ఖాతాకు ఏమైందని ప్రశ్నించారు. సాంకేతిక లోపమా లేక తాత్కాలికంగా నిలిపివేశారా అనే సందేహాలు కూడా వ్యక్తమయ్యాయి. అయితే కొద్ది గంటల తర్వాత కోహ్లీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా మళ్లీ యాక్టివేట్ కావడంతో అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. ఖాతా తిరిగి అందుబాటులోకి రావడంతో సోషల్ మీడియాలో కోహ్లీ అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అకౌంట్ తిరిగి రావడం పట్ల ఖుషీ అవుతూ కామెంట్లు, పోస్టులు చేస్తున్నారు.

## సంజూ శాంసన్‌కు లాస్ట్ చాన్స్ ఈసారి ఫెయిలైతే కష్టమే!




**ముంబై** భారత్, న్యూజిలాండ్ మధ్య జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ చివరి దశకు చేరుకుంది. ఇప్పటికే సిరీస్‌ను ఖాయం చేసుకున్న భారత జట్టు, శనివారం జరిగే ఆఖరి మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను 4–1 తేడాతో ఘనంగా ముగించాలని పట్టుదలగా ఉంది. అయితే ఈ మ్యాచ్‌లో అందరి దృష్టి మాత్రం కేరళ కుర్రాడు సంజూ శాంసన్‌పైనే కేంద్రీకృతమైంది. సొంతగడ్డపై జరుగుతున్న ఈ పోరు అతనికి అత్యంత కీలకంగా మారింది. ఈ సిరీస్‌లో ఇప్పటివరకు సంజూ శాంసన్ పూర్తిగా నిరాశపరిచాడు. ఓపెనర్‌గా అవకాశాలు లభించినప్పటికీ నాలుగు ఇన్నింగ్స్‌లలో కలిపి కేవలం 40 పరుగులు మాత్రమే చేసి విమర్శల పాలయ్యాడు. శుభ్‌మన్ గిల్‌పై వేటు వేయడంతో వచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోవడం అతనికి పెద్ద మైనస్‌గా మారింది. ఇప్పుడు సొంత ప్రేక్షకుల మధ్య ఆడుతున్న ఈ మ్యాచ్‌లో భారీ ఇన్నింగ్స్ ఆడితేనే తనపై ఉన్న ఒత్తిడిని తగ్గించుకోగల పరిస్థితి ఉంది. ఫిబ్రవరి 7 నుంచి ప్రారంభం కానున్న టీ20 ప్రపంచకప్ దృష్ట్యా ఈ మ్యాచ్ సంజూ కెరీర్‌కు టర్నింగ్ పాయింట్‌గా మారనుంది. ఈ మ్యాచ్‌లోనూ విఫలమైతే తుది జట్టులో అతని స్థానంపై తీవ్ర సందేహాలు నెలకొనే అవకాశముంది. ఇదే సమయంలో తుది జట్టులోకి ఇషాన్ కిషన్, వరుణ్ చక్రవర్తి తిరిగి వచ్చే అవకాశాలు ఉండటంతో సంజూపై ఒత్తిడి మరింత పెరిగింది. తిరువనంతపురంలోని గ్రీన్‌ఫీల్డ్ స్టేడియం భారత్‌కు అనుకూలంగా ఉంది. ఇక్కడ ఆడిన నాలుగు టీ20 మ్యాచ్‌లలో మూడు విజయాలు భారత్ ఖాతాలో ఉన్నాయి. ఈ మైదానంలో తొలి ఇన్నింగ్స్ సగటు స్కోరు 155 పరుగులు కాగా, గతంలో 235 పరుగుల భారీ స్కోరు కూడా నమోదైంది. ఈ గణాంకాలు భారత జట్టుకు సానుకూలంగా ఉన్నాయి. ఒకవైపు సిరీస్‌ను విజయంతో ముగించి ప్రపంచకప్ ముందు ఆత్మవిశ్వాసం పెంచుకోవాలని భారత్ భావిస్తుండగా, మరోవైపు కనీసం చివరి మ్యాచ్‌లోనైనా గెలిచి పర్యటనను గౌరవప్రదంగా ముగించాలని న్యూజిలాండ్ ఆశిస్తోంది. ఈ నేపథ్యంలో శనివారం జరగబోయే ఈ మ్యాచ్ సంజూ శాంసన్ భవితవ్యాన్ని నిర్ణయించే పోరుగా మారింది.

Edited, Published & Owned by **BHUPATHI SANTHOSH.** Printed at PARAHUSHAR PRINTING PUBLICATIONS, H. NO. 1-6-27/2,SRI NAGAR COLONY, MAHABUBABAD, WARANGAL, TELANGANA-506101.Published at Jammikunta, karimnagar,Telangana-505122. EDITOR: BHUPATHI SANTHOSH. Cell: 9247819181 | **RNI No: TGTEL/25/A1882,**Email:Mana vaartha tg. Daily@gmail.com

## వనదేవతల ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి..



**జమ్మికుంట, జనవరి 30( మన వార్త ప్రతినిధి):**కుంకుమ భరణీ దేవతగా,కోట్లాది మంది కొంగు బంగారంగా నిలిచిన వన దేవతల ఆశీస్సులు హుజురాబాద్ ప్రజలందరిపై ఉండాలనీ కోరుకుంటున్నట్లు హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ తెలిపారు. శుక్రవారం రోజున హుజూరాబాద్ పట్టణ పరిధిలోని రంగనాయకుల గుట్ట,మండల పరిధిలోని జూపాక గ్రామంలో,జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కేశవపూర్,వీణవంక మండల కేంద్రంలో మినీ మేడారంగా జరుగుతున్న సమ్మక్క సారలక్క జాతరకు ఆయన హజరయ్యారు. ఈ సందర్భంగా జాతర కమిటీ పార్టీ ఇంచార్జికు ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ పోరాట పటిమకు స్పూర్తిగా నిలిచిన సమ్మక్క సారలక్క తల్లులను దర్శించుకోవడం సంతోషంగా ఉందని,భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం తరుపున అన్ని చర్యలు తీసుకున్నామని,భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూసుకున్న జాతర కమిటీ వారిని అభినందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ప్రణవ్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ పట్టణ,మండల,జమ్మికుంట పట్టణ,వీణవంక మండల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వికేఎస్పి జమ్మికుంట వాసవి క్లబ్ ఆధ్వర్యంలో గాంధీ వేడుకలు..



**జమ్మికుంట, జనవరి 30( మన వార్త ప్రతినిధి):**గాంధీ వర్ధంతి సందర్భంగా వికేఎస్పి జమ్మికుంట వాసవి క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక గాంధీ చౌరస్తాలోని గాంధీ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులు గుండా రాజేంద్రప్రసాద్,ప్రధాన కార్యదర్శి చందా సంతోష్, కోశాధికారి చిరురాల పూర్ణచందర్, జోన్ చైర్ పర్సన్ అయితు రమేష్, మరియు జిల్లా ఆఫీసర్స్ గంప సురేందర్, ఆకిన పెల్లి శ్రీనివాస్, రావికంటి నీలకంఠం,అయిత రమాదేవి, వాసవి క్లబ్ సభ్యులు ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

## ఇల్లందకుంట లో గాంధీ వర్ధంతి వేడుకలు..



**ఇల్లందకుంట,జనవరి30( మన వార్త ప్రతినిధి ):**మహాత్మా గాంధీ వర్ధంతి సందర్బంగా ఇల్లందకుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెద్ది కుమార్ ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెద్ది కుమార్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు కనుమల్ల సంపత్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటాన్ని ప్రజల ఉద్యమంగా మార్చి సామాన్యుడు కూడా శక్తి ఉందని నిరూపించిన గొప్ప నాయకుడు గాంధీ అని చెప్పారు. ఈ రోజు భారతదేశ చరిత్రలోనే కాదు, ప్రపంచ మానవ చరిత్రలో అమరుడైన మహాత్మా గాంధీ వర్ధంతి వేడుకలు జరుగుతున్నాయని అన్నారు ఆయన శరీరం మన మధ్య లేకపోయినా, ఆయన ఆలోచనలు,ఆదర్శాలు మన జీవితాలకు వెలుగుదారులని అన్నారు. సత్యం, అహింస, త్యాగం ఈ మూడు ఆయుధాలతోనే గాంధీజీ బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఎదుర్కొన్నారు. హింసకు హింసతో కాదు, ప్రేమకు ప్రేమతో సమాధానం చెప్పాలి అనే సందేశాన్ని ప్రపంచానికి చాటి చెప్పారు. స్వాతంత్ర్య పోరాటాన్ని ప్రజల ఉద్యమంగా మార్చి, సామాన్యుడికి కూడా శక్తి ఉందని నిరూపించారని చెప్పారు. గాంధీజీ కేవలం రాజకీయ నాయకుడు మాత్రమే కాదు, ఆయన ఒక మహానుభావుడు, మార్గదర్శి. స్వదేశీ, స్వచ్ఛత, సమానత్వం, గ్రామ స్వరాజ్యం వంటి భావనలతో సమాజాన్ని బలపరిచే ప్రయత్నం చేశారు. “మీరే మార్పు అవ్వాలి” అనే ఆయన మాటలు నేటికీ మనకు మార్గదర్శకం అని అన్నారు. ఈ రోజున మనం గాంధీజీని స్మరించుకోవడం అంటే అహింస మార్గాన్ని అనుసరించడం, సమాజంలో న్యాయం కోసం నిలబడటం ఇవే ఆయనకు మనం ఇవ్వగల నిజమైన నివాళి అని చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్త వార్డ్ మెంబర్ గోలి కిరణ్, గూడెపు ఓదెలు, మూడెడ్ల రమేష్, జక్కు కుమారస్వామి, రావుల రాజబాబు, కట్టల కుమారస్వామి, పెద్ది అభిలాష్, దార నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## వనదేవతలకు నిలువెత్తు (బెల్లం) బంగారం తూకం..



**జమ్మికుంట, జనవరి 30(మన వార్త ప్రతినిధి):**వనదేవతలైన సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా భక్తులతో బెల్లం దుకాణాలు కకిటకిటలాడాయి. సమ్మక్క సారలమ్మ వనదేవతలకు భక్తులు బెల్లాన్ని బంగారంగా పిలుచుకుంటూ భక్తితో సమర్పించుకుంటారు. తమ కోరికలు నెరవేర్చితే తామెత్తు బెల్లాన్ని( బంగారం) ఇస్తాశీ తల్లి అంటూ మొక్కుకొని కోరికలు తీరిన వెంటనే తమతో సరితూగే బంగారం (బెల్లం) అమ్మవార్లకు సమర్పిస్తూ మొక్కులు చెల్లించుకుంటారు. వనదేవతలను దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అందులో ఎత్తు బంగారం సమర్పించుకుంటే సకల శుభాలు జరుగుతాయన్నది నమ్మకం. భక్తులు కోరిన కోర్కెలు తీరిన వేళ తల్లులకు నిలువెత్తు బంగారం సమర్పించుకునేందుకు జమ్మికుంటలో బెల్లం దుకాణాలు భక్తులతో కిటకిటలాడాయి. తామేత్తు బెల్లం (బంగారం) తూకం వేసుకున్నారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం బెల్లంతో పాటు చెక్కర (పంచదార) ను సరిసమానంగా తూకం వేసుకుంటున్నారని వ్యాపారస్తులు చెప్తున్నారు. కోరిన కోర్కెలు నెరవేరిన తరువాత మొక్కుకున్న విధంగా తనువెత్తు బండారాన్ని( బెల్లం) తూకం వేసి మొక్కు చెల్లించుకోని బంధువులకు, స్నేహితులకు పంచిపెట్టడం అనాదిగా వస్తున్న ఆచారం. కాని రానురాను మానవులలో మార్పు వస్తుంది. మొక్కు బంగారం (బెల్లం) వంట పనులు వాడుకోకూడదని చక్కెర (పంచదార)ను బెల్లంతో సరిసమానంగా తూకం వేస్తున్నారు.

## సమ్మక్క సారలమ్మ లకు మొక్కులు..



**జమ్మికుంట, జనవరి 30( మన వార్త ప్రతినిధి):**కోరిన కోరికలు తీర్చే భక్తులకు కొంగుబంగారమైన సమ్మక్క, సారలమ్మ వన0విడి జనంలోకి వచ్చి బుధవారం సారక్క గురువారం సమ్మక్క గద్దేలపై కొలువు తీరారు. జమ్మికుంట పట్టణంలోని కేశావపూర్ లో శుక్రవారం వనదేవతలను దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. ఎత్తు బంగారం,ఎదురుకోల్లు,తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తజన సందమైంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ ఆధ్వర్యంలో విద్యుత్ ,వైద్య సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. మండలం పరిధిలోని తనుగుల,వావిలాల లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

## ముగిసిన నామినేషన్ల ప్రక్రియ..




**జమ్మికుంట,జనవరి 30 (మన వార్త ప్రతినిధి):**తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు సంబంధించి 2026 సాధారణ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. జనవరి 28వ తేదీ బుధవారం నుంచి ప్రారంభమైన నామినేషన్ల స్వీకరణ జనవరి 30వ తేదీ సాయంత్రం 5:00 గంటల వరకు పోటీలో నిలిచే అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేశారు. చివరి రోజు కావడంతో నామినేషన్ల స్వీకరణ రాత్రి 8 గంటలవరకు కొనసాగింది. ఐతే సమయం లోపు వచ్చిన అభ్యర్థుల నామినేషన్ల పత్రాలు స్వీకరించారు. జనవరి 31న నామినేషన్ల పరిశీలన చేపట్టి, అదే రోజు సాయంత్రం అర్హత పొందిన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. ఫిబ్రవరి 3వ తేదీ మధ్యాహ్నం 3:00 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు. అనంతరం తుది బరిలో నిలిచే అభ్యర్థుల జాబితాను విడుదల చేయనున్నారు. ఫిబ్రవరి 11వ తేదీన ఉదయం 7:00 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు ఎన్నికలు జరగనున్నాయి. ఫిబ్రవరి 13వ తేదీన ఉదయం 8:00 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఓట్ల లెక్కింపు పూర్తయిన వెంటనే ఫలితాలు వెల్లడిస్తారు.

## వాసవి క్లబ్ ఆధ్వర్యంలో గాంధీ మహాత్ముడికి ఘన నివాళి...



**జమ్మికుంట, జనవరి 30(మనవార్త)**జమ్మికుంట పట్టణంలో జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి నీ పురస్కరించుకొని స్థానిక గాంధీ చౌరస్తాలో వాసవి క్లబ్ అధ్యక్షులు గుడివాడ వెంకట సతీష్ ఆధ్వర్యంలో వాసవి క్లబ్ సభ్యులతో కలిసి గాంధీ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాంధీ మహాత్ముడు స్వాతంత్రం తీసుకురావడానికి ఎనలేని కృషి చేసిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. వారి అడుగుజాడల్లో ముందుకు సాగుదాం అన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులు గుడివాడ వెంకట సతీష్,ప్రధాన కార్యదర్శి రేణికుంట రాజు, ఆర్థిక కార్యదర్శి అయితు శ్రీనివాస్,జెడ్ సి అయితు రమేష్ మరియు జిల్లా ఆఫీసర్స్ వాసవి క్లబ్ సభ్యులు ఆర్యవైశ్యులు తదితరులు పాల్గొన్నారు.

## 7 వ వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన ఎన్ సీ సంతోష్

**గజ్వేల్ జనవరి 30 మన వార్త ప్రతినిధి** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ 7వ వార్డు (ఎర్రవల్లి, సింగారం) ఆర్ అండ్ ఆర్ కాలనీ బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిగా సిద్దిపేట జిల్లా కబడ్డి అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.సి. సంతోష్ గజ్వేల్ ఐఓసీ కార్యాలయంలో ఎన్నికల అధికారులకు నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడవ వార్డు ప్రజలు తనను ఆశీర్వదించి భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు, గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని, అదేవిధంగా గజ్వేల్ నియోజకవర్గంలోని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ దేశంలోనే అభివృద్ధిలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఆదర్శ మున్సిపాలిటీగా అవార్డులు అందుకుందన్నారు. కాంగ్రెస్ , బీజేపీ పార్టీలని ప్రజలు నమ్మే స్థితిలో లేరని అన్నారు కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు

## 2వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించిన కౌన్సిలర్ అభ్యర్థి గోలి మమత సంతోష్

**గజ్వేల్ జనవరి 30 మన వార్త ప్రతినిధి** గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ 2వ వార్డులో బీఆర్ఎస్ పార్టీ తరపున కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గోలి మమత సంతోష్ శుక్రవారం వార్డులో ముమ్మరంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వార్డులోని ప్రతి గడపకూ వెళ్ళి, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ, కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా గోలి మమత సంతోష్ మాట్లాడుతూ గత ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వంలో గజ్వేల్ నియోజకవర్గం దేశంలోనే అభివృద్ధిలో అగ్రగామిగా నిలిచిందని గుర్తుచేశారు. గజ్వేల్ రూపురేఖలు మార్చిన ఘనత బీఆర్ఎస్ పార్టీకే దక్కుతుందన్నారు. కానీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గజ్వేల్ అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, ప్రస్తుతం ప్రగతికి ఆమడ దూరంలో ఉందని విమర్శించారు. వార్డు ప్రజలు అభివృద్ధిని కాంక్షించి, బీఆర్ఎస్ పార్టీని ఆదరించాలని, తనను భారీ మెజారిటీతో గెలిపిస్తే వార్డును అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.

## యాదమ్మ నగర్ కాలనీలో కమ్యూనిటీ పోలీసింగ్ పలు అంశాలపై అవగాహన

**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా జనవరి 30 మన వార్త :** ఆల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని యాదమ్మ నగర్ కాలనీలో కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆల్వాల్ ఎస్‌హెచ్ఓ, సెక్టర్ ఎస్ఐ గీత, ఏఎస్ఐ తుల్జారాం, హెచ్‌సి శ్రీనివాస్ రెడ్డి మరియు పిసి నరేష్ పాల్గొని కాలనీ ప్రజలకు వివిధ కీలక అంశాలపై అవగాహన కల్పించారు. కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమం ద్వారా పోలీస్ ప్రజల మధ్య నమ్మకం మరింత బలపడుతుందని, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం అత్యంత అవసరమని పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని, పోలీసుల సూచనలను ఆసక్తిగా విన్నారు.

## వనదేవతలకు మొక్కులు తీర్చుకున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

**శంకరపట్నం:జనవరి30(మనవార్త ప్రతినిధి)**శంకరపట్నం మండలం కేశవపట్నం సమ్మక్క- సారలమ్మ జాతరలో మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శుక్రవారం పాల్గొని వన దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు జాతర కమిటీ చైర్మన్ గుర్రం స్వామి,కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. ఎమ్మెల్యే వెంట పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోపగోని బస్వయ్య గౌడ్,హుజురాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపల్లి,పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు మొలంగూరి సదానందం,పార్టీ నాయకులు దుర్గపు తిరుపతి,గొట్టె మధు,గాజుల మహేష్, రాయిని రమేష్,జనగాం రాజయ్య,కీసర సంపత్,ఆడెపు అజయ్,ఇసామొద్దీన్,వెంగళ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## జవీ కప్ కబడ్డీ వాలీబాల్ పోటీలు ప్రారంభోత్సవం

**రాజన్న సిరిసిల్ల జిల్లా,ఎల్లారెడ్డి పేట మండల, మన వార్త ప్రతినిధి జనవరి:30**ఎల్లారెడ్డిపేట పట్టణకేంద్రంలోనీ పల్లె ప్రకృతి వనం లోని క్రీడా మైదానంలో సీఎం కప్ కబడ్డీ, వాలీబాల్, పోటీలను రాచర్ల బొప్పాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ షేక్ సగారా బేగం, స్థానిక ప్రజా ప్రతినిధులు నాయకులు పాల్గొని క్రీడలను ప్రారంభించారు, కబడ్డీ వాలీబాల్ లాంటి ఆటలను ఆడితే పిల్లల భవిష్యత్తు బాగుంటుందని మరియు క్రీడల వల్ల పిల్లలకు ఉద్యోగాలు వచ్చే అవకాశాలు ఉంటాయని అదేవిధంగా ఆరోగ్యం బాగుంటుందని నిత్యము క్రీడల్లో పాల్గొని చదువుల్లో ముందుండి ఫోన్లు చూడకుండా పిల్లలు ఉంటే భవిష్యత్తులో ఎంతో ఎత్తుకు ఎదగచ్చని ఎంపీడీవో సత్తయ్య ఇలా అన్నారు ఈ కార్యక్రమంలో,మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు దొమ్మాటి నరసయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామ్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మెండే శ్రీనివాస్, వర్డ్ ప్రవీణ్, నాయకులు చిన్ని బాబు,గిరిధర్ రెడ్డి,షకీల్, తదితరులు పాల్గొన్నారు,

## నార్త్ ఈస్ట్ కేఫ్ పై కేసు నమోదు చేసిన పోలీసులు...

**నార్సింగి జనవరి 30 ( మన వార్త ప్రతినిధి)** మెదక్ జిల్లా నార్సింగి మండల పరిధిలోని నార్త్ ఈస్ట్ కేఫ్ లో అక్రమంగా మద్యం తాగడానికి అనుమతిస్తున్న కేఫ్ నిర్వాహకుల పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సృజన తెలిపారు. 44వ జాతీయ రహదారి పై ఉన్న నార్త్ ఈస్ట్ కేఫ్ లో మద్యం తాగడానికి అనుమతిస్తున్నారన్న నమ్మదగిన సమాచారం మేరకు గురువారం సాయంత్రం 6 గం లకు ఎస్ఐ సృజన సిబ్బందితో చేరుకుని కేఫ్ లో సోదాలు నిర్వహించారు. ఎలాంటి అనుమతులు లేకుండా చట్ట వ్యతిరేకంగా మద్యం తాగడానికి అనుమతిస్తున్న నార్త్ ఈస్ట్ కేఫ్ యజమాని దొంతిరెడ్డి రవీందర్ రెడ్డి తండ్రి చంద్రా రెడ్డి కేఫ్ ఉద్యోగి వర్ధం మహేష్ తండ్రి లచ్చయ్య పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సృజన తెలిపారు.

## సీఎం కప్పు సీజన్ 2 లో సిరికొండ ఆడబిడ్డలు సత్తా చూపారు



**నిజామాబాద్ జిల్లా సిరికొండ( మన వార్త) జనవరి 30**సిరికొండ మండల కేంద్రంలో సీఎం కప్ సీజన్-2లో సిరికొండ ఆడబిడ్డలు సత్తా చాటారు. కబడ్డీ మరియు వాలీబాల్ రెండింటిలోనూ ప్రథమ బహుమతులు గెలుచుకుని, సిరికొండ పేరును మారుమోగించారు. పట్టుదల ఉంటే ఆకాశమే హద్దు అని నిరూపించిన మన విజేతలకు ఇవే మా హృదయపూర్వక అభినందనలు అటు అమ్మాయిలతో పాటు ఇటు అబ్బాయిలు కూడా పరుగు పందెంలో మరియు కోకో, వాలీబాల్ మరియు కబడ్డీ పోటీల్లో 1వ, 2వ మరియు 3వ బహుమతులు సాధించి తమ సత్తా చాటారు.